విశాఖ భూ దందాపై ప్రభుత్వం ఫోకస్!

నేడు అమరావతిలో శ్వేతపత్రం విడుదల

ఉమ్మడి జిల్లాలో సాగిన వ్యవహారాలపై ఆరా

- ఎయిర్‌పోర్టులో నిర్వహించిన సమీక్షలో వివరాలు తెలుసుకున్న సీఎం
- అడ్డగోలు దందాలపై ముఖ్యమంత్రికి నివేదించిన టీడీపీ నేతలు
- విశాఖ ఫైల్స్ పేరుతో నివేదిక సిద్ధం చేశామన్న ఎమ్మెల్యే గంటా

విశాఖపట్నం, జూలై 14 (ఆంధ్రజ్యోతి):

విశాఖ కేంద్రంగా గత ప్రభుత్వ పాలకులు, వైసీపీ అనుచరులు సాగించిన భూ దందాలపై ప్రభుత్వం దృష్టిసారించింది. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకు భిన్నంగా విశాఖలో వేల కోట్ల ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు దోపిడీకి గురయ్యాయని కొత్త ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో సోమవారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ దందాలు, గనుల దోపిడీపై శ్వేతపత్రం విడుదల చేయనున్నారు. ఇందులో ప్రధానంగా విశాఖలో భూదోపిడీపై పలు అంశాలను ప్రత్యేకంగా ప్రస్తావించనున్నారని సమాచారం.

వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఉమ్మడి విశాఖ జిల్లాతోపాటు నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను కబ్జా చేయడం, బలవంతంగా లాక్కోవడం లాంటి అనేక దారుణ సంఘటనలు చోటుచేసుకున్నాయి. వాటన్నింటి వివరాలను ప్రభుత్వం పూర్తిస్థాయిలో సేకరించింది. నగరానికి చెందిన తెలుగుదేశం నేతలు, జిల్లా యంత్రాంగం నుంచి వేర్వేరుగా సమాచారం తీసుకున్నట్టు తెలిసింది. నగరంలో భూ కబ్జాలపై గతంలో పనిచేసిన ఒక ఐఏఎస్ అధికారి నుంచి కూడా వివరాలతో నివేదిక కూడా తీసుకున్నారని సమాచారం. కొత్తగా వచ్చిన జిల్లా కలెక్టర్ హరేంధిర్ ప్రసాద్ మరో నివేదిక ఇచ్చినట్టు తెలిసింది. ఇంకా తెలుగుదేశం నుంచి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు నివేదిక అందజేశారు. భూ కబ్జాలపై విశాఖ నుంచి సమగ్ర వివరాల సేకరించడంలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ కీలకభూమి



నగరంలోని దసపల్లా భూములు

పోషించారని సమాచారం. నాలుగు రోజుల క్రితం జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబు నాయుడు విశాఖలో భూ కబ్జాలపై చర్యలు తీసుకుంటామని ప్రకటించిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం నివేదిక రూపొందించినట్టు తెలిసింది.

బే పార్కుతో ప్రారంభం

విశాఖలో బేపార్కు నుంచి భూ దందాల పంచాయితీ ప్రారంభమయింది. ఇది వైసీపీ ఐదేళ్ల పాలన ముగిసేవరకు కొనసాగింది. కార్తీకవనం చేజిక్కించుకుని రాడిసిన్ బ్లూ హోటల్ నిర్మాణం, భీమిలిలో భూ యజమానులను బెదిరించి భారీఎత్తున భూములు కారుచౌకగా లాక్కోవడం, దసపల్లా భూములను 22(ఏ) నుంచి తొలగించి ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తెకు చెందిన కంపెనీతో డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ చేసుకోవడం వరకు కొనసాగింది. ఈ వ్యవహారంలో అప్పటి ప్రభుత్వంలో కీలక పెద్దల పాత్ర ఉందనేది బహిరంగ రహస్యం. రుషికొండ ప్రాంతంలోని పనోరమ హిల్స్ పరిసరాల్లో పలువురి నుంచి బలవంతంగా ప్లాట్లు తీసుకుని భారీ కట్టడాలు నిర్మిస్తున్నారు. మధురవాడ ఐటీ హిల్స్ సమీపంలో ఎన్‌సీసీకి చెందిన 100 ఎకరాల భూమిని బెదిరింపులకు పాల్పడి టేకోవర్ చేసుకుని, గత ప్రభుత్వంలో పనిచేసిన మంత్రి తమ్ముడికి అప్పగించారు. రుషికొండ తారకరామా లేఅవుట్‌లో రేడియంట్ కంపెనీకి చెందిన 50 ఎకరాలను కూడా లాక్కున్నారు. నగరంలో పలుచోట్ల అడ్డగోలుగా టీడీఆర్‌లు కొట్టేశారు.

అసైన్డ్ భూములపైనా కన్ను

ఇదిలావుండగా గ్రామీణ మండలాలైన ఆనందపురం, భీమిలి, పద్మనాభం, పెందుర్తిలో అసైన్డ్ భూములను చేజిక్కించుకునేందుకు జీవో 596 జీవో తీసుకువచ్చారు. గత ప్రభుత్వంలో ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన కేఎస్ జవహర్‌రెడ్డి బినామీలు త్రిలోక్‌తో పాటు మరికొందరు వందల ఎకరాలకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు పొంది రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. ఇలా సుమారు 2,500 ఎకరాలకు ... మిగతా 6వ పేజీలో



పరశురామావతారంలో జగన్నాథుడు

రథయాత్ర సందర్భంగా టర్నర్ చౌల్ట్రీలో కొలువుదీరిన జగన్నాథుడు ఆదివారం పరశురామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున స్వామికి విశేష పూజలు చేసిన అర్చకులు పరశురామావతారంలో అలంకరించారు. అనంతరం భక్తులు విశేష సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. సోమవారం రామావతారంలో జగన్నాథుడు భక్తులకు దర్శనమివ్వనున్నారు. - పూర్ణామార్కెట్

జీతాలు, తక్షణ వ్యయాలకే నిధులు

బిల్లుల చెల్లింపునకు నో..

- వీఎంఆర్‌డీఏను ఆదేశించిన రాష్ట్ర ప్రభుత్వం
- కాంట్రాక్టర్లు చేపట్టిన పనులను పూర్తిగా సమీక్షించాలని నిర్ణయం



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ)ను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లుల చెల్లింపును తాత్కాలికంగా నిలిపివేయాలని ఆదేశించింది. అయితే జీతాలు తక్షణ అవసరాలకు మాత్రం నిధులు ఖర్చు చేసేలా వెసులుబాటు కల్పించింది.

వీఎంఆర్‌డీఏ పరిధిలో జగనన్న లేఅవుట్లు, జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లు, మల్టీ లెవెల్ కారు పార్కింగ్, మాస్టర్ ప్లాన్ రహదారులు వంటివి ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నాయి. లేఅవుట్ల అభివృద్ధికి కోట్లలో వ్యయం జరుగుతోంది. వీటిలో అత్యధికం వైసీపీ హయాంలో నామినేషన్ పద్ధతిపై రాయలసీమ జిల్లాలకు చెందిన కాంట్రాక్టర్లకే కట్టబెట్టారు. గతంలో వారు చేసిన పనులకు వెంటనే బిల్లులు మంజూరయ్యేలా అప్పటి ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడంతో అధికారులు ఆగమేఘాలపై చెల్లించేవారు. మధ్యలో కొర్రీలు వేస్తే తలంటేవారు. కమిషనర్ క్లియరెన్స్ ఇచ్చిన తరువాత 48 గంటల్లో చెల్లింపులు జరిగిపోవాలని ప్రత్యేక ఆదేశాలుండేవి. అయినా అకౌంట్స్ విభాగంలో కొన్ని బిల్లులు నిలిచిపోయాయి. వాటిపై కాంట్రాక్టర్లు ఫిర్యాదు చేయడంతో వెంటనే చెల్లింపులు జరిగాయి. బ్యాంకుల్లో తగినన్ని నిధులు లేకపోయినా, డిపాజిట్లు వెనక్కి తీసుకొని మరీ చెల్లించారు.

అడ్డగోలు చెల్లింపులొద్దు

కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పాత బిల్లులు చెల్లించవద్దని స్పష్టమైనా ఆదేశాలు ఇచ్చింది. కాంట్రాక్టర్లు ఎవరు అనే దానితో సంబంధం లేకుండా, ఆయా సంస్థలు, చేపట్టిన పనులపై పూర్తిగా సమీక్షించాకే మిగిలిన బిల్లులు చెల్లించే అంశం పరిశీలిస్తామని, అంతవరకు పెండింగ్‌లో పెట్టాలని స్పష్టంగా చెప్పడంతో బిల్లులను నిలిపివేశారు. అంతేకాదు ఇటీవల వీఎంఆర్‌డీఏ అధికారులతో పురపాలక శాఖా మంత్రి నారాయణ విజయవాడలో నిర్వహించిన సమీక్ష సమావేశంలోనే ఇదే విషయం తేల్చి చెప్పారు. త్వరలోనే విశాఖపట్నం వచ్చి సమీక్షిస్తామని, అంతవరకు బిల్లుల చెల్లింపులు చేపట్టవద్దని సూచించారు. నెలనెలా ఉద్యోగుల జీతభత్యాలు, నిర్వహణ వ్యయాలు మినహా మిగిలిన నిధులు ఖర్చు చేయవద్దని ఆదేశించారు. దీంతో వీఎంఆర్‌డీఏలో కాంట్రాక్టర్లకు బిల్లులు నిలిచిపోయాయి. ఈ విషయం తెలియక పలువురు బిల్లులు చెల్లించడం లేదని, క్లియర్ చేయాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో అధికారులు వారికి నచ్చచెప్పే ప్రయత్నం చేస్తున్నారు. వీఎంఆర్‌డీఏలో వివిధ పనుల నిమిత్తం ప్రతినెలా కనీసం రూ.50 కోట్ల మేర బిల్లులు చెల్లించేవారు.

మునిసిపాలిటీలకు సహకారం

ఆర్థిక పరిస్థితి సరిగా లేక అభివృద్ధి పనులు చేపట్టలేకపోతున్న మునిసిపాలిటీలకు అండగా నిలవాలని వీఎంఆర్‌డీఏ అధికారులకు పురపాలక శాఖా మంత్రి సూచించారు. అలాంటి మునిసిపాలిటీలను తక్షణమే గుర్తించి, మౌలిక, అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ మేరకు అనకాపల్లి జిల్లాలోని ఎలమంచిలి, నర్సీపట్నం మునిసిపాలిటీల కమిషనర్లతో సమావేశం నిర్వహించి, అవసరాలు తెలుసుకోవడానికి వీఎంఆర్‌డీఏ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

ముడసర్లోవ పార్కులో హార్స్‌రైడింగ్ ప్రాజెక్టు

రూ.5.5 కోట్ల వ్యయంతో ఏర్పాటు

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు

- యంత్రాలతో భూమి చదును, పొదల తొలగింపు
- జీవవైవిధ్యానికి ముప్పువాటిల్లుతుందని పర్యావరణవేత్తల ఆందోళన
- తక్షణం పనులు నిలిపేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ
- స్పందించిన డిప్యూటీ సీఎం కార్యాలయ అధికారులు
- జీవీఎంసీ అధికారులను వివరణ కోరినట్టు సమాచారం!



ముడసర్లోవ పార్కులో హార్స్‌రైడింగ్ ప్రాజెక్టు పనులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

అనేక జీవరాశుల ఆవాసంగా ఉన్న ముడసర్లోవ రిజర్వాయర్ పార్కులో హార్స్ రైడింగ్ ప్రాజెక్టు పేరుతో విధ్వంసం సృష్టిస్తున్నారు. పర్యాటకులను ఆకట్టుకునేందుకు నగరంలో గుర్రపు స్వారీ అందుబాటులోకి తెచ్చేందుకు వీలుగా జీవీఎంసీ అధికారులు రూ.5.5 కోట్ల వ్యయంతో ముడసర్లోవపార్కులో పనులు ప్రారంభించారు. పార్కులో ఎటువంటి కాంక్రీట్ నిర్మాణాలు చేపట్టకూడదనే నిబంధన ఉన్నప్పటికీ అడ్డగోలుగా పనులు పూర్తిచేస్తున్నారు. యంత్రాలతో మొక్కలు, పొదలను తొలగించడంతో అనేక జీవుల మనుగడకు ముప్పు వాటిల్లుతోందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రంలోనే అత్యంత పురాతనమైనదిగా ముడసర్లోవ రిజర్వాయర్‌కు గుర్తింపు వుంది. నగర ప్రజల తాగునీటి అవసరాల కోసం 1901లో దీనిని నిర్మించారు. 80 ఎకరాల్లో విస్తరించి ఉన్న రిజర్వాయర్‌కు సుమారు 4,216 ఎకరాల పరీవాహక ప్రాంతం ఉంది. రిజర్వాయర్‌ను ఆనుకుని 20 ఎకరాల్లో పార్కును నిర్మించారు. ఇందులో అనేక జాతులకు చెందిన వేలాది చెట్లు ఉండడంతో చిట్టడవిని తలపిస్తుంది. పార్కుకు ఒకవైపు రిజర్వాయర్, మరోవైపు చెట్లు ఉండడంతో సుమారు 105 రకాల పక్షులు ఇక్కడ ఆవాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నాయి. ప్రకృతి ఆలవాలమైన ముడసర్లోవ పార్కును నగరవాసులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు కూడా సందర్శిస్తుంటారు.

అంచెలంచెలుగా విధ్వంసం

జాతీయస్థాయి పర్యావరణవేత్తలు, ఉద్యమకారులు నగరానికి వచ్చి సందర్భంగా అత్యంతపురాతమైన ముడసర్లోవ పార్కును పరిశీలించి, దానిని పరిరక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూనే ఉన్నారు. అయితే ఆ దిశగా చర్యలు తీసుకోవాల్సిన జీవీఎంసీ అధికారులు అంచెలంచెలుగా విధ్వంసానికి పావులు కదుపుతున్నారు. ఇందులో భాగంగా పార్కులోని సుమారు నాలుగు ఎకరాల స్థలాన్ని హార్స్‌రైడింగ్ ప్రాజెక్టుకు కేటాయించారు. రూ.5.5 కోట్ల వ్యయంతో ఏర్పాటుచేసే ఈ ప్రాజెక్టు కోసం నిబంధనలకు విరుద్ధంగా కాంక్రీట్‌తో భారీ నిర్మాణాలు చేపడుతున్నారు. గుర్రాలను ఉంచడానికి ప్రత్యేకంగా షెడ్లు, గుర్రపు స్వారీ చేయడానికి ట్రాక్ నిర్మాణం, సందర్శకులు వేచి వుండేందుకు షెడ్ల నిర్మాణం చేపడుతున్నారు. ఇక్కడి పార్కులో చెట్లను తొలగించడం చట్టరీత్యా నేరమని తెలిసినప్పటికీ, యంత్రాల సాయంతో మొక్కలు, గుబురుగా పెరిగిన పొదలతో పాటు, భారీ వృక్షాల కొమ్మలను తొలగించేస్తున్నారు. దీనివల్ల ... మిగతా 6వ పేజీలో




యంత్రాలతో పనులు చేస్తున్న దృశ్యం

కేజీహెచ్ కథ మారేనా?

రోగులకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం

- సమయపాలన పాటించని వైద్యులు, సిబ్బంది
- వివిధ విభాగాల్లో తాగునీటికి ఇక్కట్లు
- వేధిస్తున్న పరికరాల కొరత
- ఇన్‌చార్జి సూపరింటెండెంట్ పాలనలోనే ఆస్పత్రి
- శిథిలావస్థలో అనేక భవనాలు
- నేడు ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ పర్యటన



విశాఖపట్నం, జూలై 14 (ఆంధ్రజ్యోతి):

ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయిని కింగ్‌జార్జి ఆస్పత్రిలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. శిథిల భవనాలు, పరికరాల కొరత, ఇతర సమస్యలు ఓవైపు పీడిస్తుండగా... మరో వైపు వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం... రోగులకు సమయానికి అందని వైద్య సేవలు, ఆరోగ్య పరీక్షలకు ఎదురు చూపులు... ఇలా అనేక అవస్థల మధ్య ఆస్పత్రి నడుస్తోంది. దీనికితోడు గత కొద్ది నెలలుగా కేజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ పర్యవేక్షణలోనే నడుస్తుండడం మరిన్ని ఇబ్బందులకు గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ సోమవారం కేజీహెచ్‌లో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. దీంతో ఇక్కడి సమస్యలకు శాశ్వతంగా పరిష్కారం లభిస్తుందని రోగులు, వారి బంధువులు ఆశిస్తున్నారు.

ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలు, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి కేజీహెచ్‌కు ప్రతిరోజూ వందలాది మంది రోగులు వస్తుంటారు. అయితే ఇక్కడ నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఇప్పటికీ అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా కీలక విభాగాల్లో వైద్యుల కొరత వేధిస్తుండడం రోగులకు సమస్యగా మారింది. ఆస్పత్రిలో 30కిపైగా విభాగాలుండగా, సుమారు పదికిపైగా విభాగాల్లో ప్రొఫెసర్లు, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ల కొరత ఉంది. సూపర్ స్పెషాలిటీ వంటి విభాగాల్లో అధునాతన వైద్య పరికరాలకు కొరత పీడిస్తోంది. పెరుగుతున్న రోగులు సంఖ్యకు అనుగుణంగా విభాగాలను, వార్డులను పెంచాల్సి ఉండగా ఆ దిశగా ఎలాంటి చర్యలు కనిపించడం లేదు. నర్సింగ్, ఇతర సిబ్బంది సంఖ్యకూడా తక్కువగానే ఉంది.

శిథిలావస్థలో భవనాలు..

వందేళ్లకుపైగా చరిత్ర కలిగిన కేజీహెచ్‌లోని అనేక విభాగాలకు చెందిన భవనాలు శిథిలావస్థకు చేరాయి. వర్షాలు కురిస్తే నీరు కారుతున్నాయి. కొన్ని విభాగాల గోడలపై మొక్కలు మొలిచాయి. ఈ భవనాల వల్ల రోగులు, వైద్యులకు ప్రమాదం. గత ప్రభుత్వం నాడు - నేడు పథకంలో భాగంగా నూతన భవనాలను నిర్మిస్తామని హామీ ఇవ్వడం మినహా రూపాయి విదల్చలేదు. ఫలితంగా సమస్యకు పరిష్కారం లభించలేదు.

నేడు జిల్లాకు ఆరోగ్యశాఖా మంత్రి



విశాఖపట్నం : వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సోమవారం జిల్లాకు రానున్నారు. ఉదయం 11.25 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుని, అక్కడి నుంచి నగరానికి వస్తారు. మధ్యాహ్నం 1.30 గంటల వరకు స్థానికంగా ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.30 గంటలకు కేజీహెచ్‌కు చేరుకుని అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు బయలుదేరి విజయవాడ వెళతారు.

సిబ్బందిపై పర్యవేక్షణ నిల్

వైద్యులు, సిబ్బందితోపాటు వార్డు బాయ్‌లు, ఇతర సిబ్బంది ఇష్టానుసారంగా పనిచేస్తారన్న ఆరోపణలున్నాయి. చాలా మంది వైద్యులు విధి నిర్వహణ సమయంలో తమ క్లినిక్‌లు, ప్రైవేటు ఆస్పత్రుల్లో పనిచేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వాలు మారుతున్నా వీరి వ్యవహారశైలిలో మార్పు కనిపించడం లేదు. కింది స్థాయి సిబ్బంది రోగులతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కొందరు డబ్బులు డిమాండ్ చేయడంతో పాటు, ఇవ్వకుంటే సేవలు అందించని పరిస్థితి నెలకొంది. కీలక మందుల సరఫరాలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చాలా సమయాల్లో రోగులు అధిక ధరలకు బహిరంగ మార్కెట్‌లో మందులు, శస్త్రచికిత్స పరికరాలను కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితులున్నాయి. దీనికి తోడు గతంలో ఎన్నడూ లేని విధంగా కేజీహెచ్ వివాదాలకు కేంద్రంగా మారింది.

ఇబ్బందులకు చెక్ చెప్పేలా..

ఆస్పత్రిలోని క్యాజువాల్టీ నుంచి, వార్డుల్లో చేరిన తరువాత వరకు రోగులు అనేక ... మిగతా 6వ పేజీలో



కిక్కిరిసిన తీరం

సాగరతీరం జనంతో కిక్కిరిసింది. ఆదివారం కావడంతో సాయంత్రమయ్యే సరికి నగర వాసులు తీరానికి భారీగా చేరారు. రుతుపవనాలు ప్రవేశించినా వేడి వాతావరణం కొనసాగడంతో ఆర్‌కే బీచ్, తెన్నేటి పార్కు, రుషికొండ, సాగర్ నగర్, భీమిలి బీచ్‌లు జనంతో నిండిపోయాయి.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

గంజాయి బ్యాచ్‌లను నిరోధించాలి: సీపీ



సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

జగదాంబ కూడలి, జూలై 14: గంజాయి బ్యాచ్‌లు, ఆకతాయిల ఆగడాలను నిరోధించాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశించారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. స్టేషన్‌లో పలు కేసులకు సంబంధించి ఆరా తీశారు. స్టేషన్ లో సివిల్ కేసుల్లో సిబ్బంది పాత్రపై ఆరా తీశారు. పెండింగ్ కేసులకు సంబంధించి రికార్డుల తనిఖీలు చేశారు. లా అండ్ ఆర్డర్‌కు సంబంధించి నమోదవుతున్న కేసుల వివరాలను అడిగితెలుసుకున్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. వన్‌టౌన్‌లో గస్తీ ముమ్మరం చేయాలని ఎస్ఐకి ఆదేశించారు. విధుల్లో సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.



కళాశాల గ్రంథాలయంలో విద్యార్థినులు



అధునాతన కంప్యూటర్ ల్యాబ్

బోధనలో టాప్.. ఫలితాల్లో మేటి

- దూసుకుపోతున్న విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల
- ఎన్ఏఏసీ ఏ ప్లస్ గ్రేడ్ సాధించిన తొలి కళాశాలగా గుర్తింపు
- రికార్డింగ్ రూమ్ .. గ్రంథాలయ సౌకర్యం
- డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ప్రవేశాలు
- అందుబాటులో పీజీ 340, యూజీలో 800 సీట్లు

డాబాగార్డెన్స్, జూలై 14: నగరం మధ్యన పచ్చని చెట్లతో ఆహ్లాదకరమైన వాతావరణంలో విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. ఆధునిక పరిజ్ఞానం, అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధనతో విద్యార్థినులను తీర్చిదిద్దుతున్నారు. ఈ కళాశాలలో విద్య నభ్యసించి ఎంతో మంది ఉన్నత శిఖరాలు అధిరోహిస్తున్నారు. ఈ క్రమంలోనే దేశంలోనే ఎన్ఏఏసీ ఏప్లస్ గ్రేడ్ సాధించిన తొలి మహిళా డిగ్రీ కళాశాలగా గుర్తింపు పొందింది. స్వయం ప్రతిపత్తి హోదా కూడా పొందిన ఈ కళాశాలలో డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో మొదటి సంవత్సరంలో చేరాలనుకున్న విద్యార్థినులకు సింగల్ మేజర్ సబ్జెక్టు విధానంలో బీఏ, బీకాం , బీఎస్సీ గ్రూప్‌లకు సంబంధించి సుమారు 800 వరకు సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినులు ఈ నెల 20వ తేదీలోగా తమ పేర్లను తమ కళాశాల వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు.

నామ మాత్ర ఫీజులు

కళాశాలలోని అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నాణ్యతమైన విద్యాబోధన, ప్రభుత్వ నిర్ణయించిన నామమాత్రపు ఫీజుల సదుపాయంతో అన్ని వర్గాల విద్యార్థులకు చదువుకునేందుకు వీలుకల్పిస్తున్నారు. అలాగే, అత్యాధునిక పరికరాలతో కూడిన సైన్స్ ల్యాబ్‌లు, కంప్యూటర్ పరిజ్ఞానం ఇంగ్లీష్ ల్యాబ్ ద్వారా స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్ సదుపాయం, రీడింగ్ మాల్, వివిధ రకాలకు ఉపయోగపడే లైబ్రరీ విద్యార్థినులకు చేరువగా ఉన్నాయి.

వీడియో రికార్డింగ్ రూమ్ ..

ఇటీవలే కళాశాలలో వీడియో రికార్డింగ్ రూమ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. దీని ద్వారా అధ్యాపకులు అర్థవంతమైన, సులభ రీతిలో పాఠాలు బోధించేందుకుసిద్ధమవుతున్నారు. దీంతో పాటు అధునాతనంగా కంప్యూటర్స్‌ను వివిధ విభాగాల్లో ఏర్పాటు చేశారు. ఇప్పటికే కళాశాలలోని 1800 వరకు విద్యార్థినులు చదువుతున్నారు. 2024- 25 విద్యా సంవత్సరానికి పీజీలోని 800 సీట్లు, యూజీలోని 340 సీట్లు అందుబాటులోనున్నాయి.

పీజీలోని వివిధ గ్రూపుల్లో ఖాళీలు..



డిజిటల్ తరగతి గది

పీజీలోని ఎం.ఎ ఇంగ్లీష్‌లో 40 సీట్లు, ఎంఎ ఎకనామిక్స్‌లో 40, ఎకాంలో 40, ఎంఎస్సీ సైకాలజీలో 40, ఎంఎస్సీ మైక్రోబయాలజీలో 40, ఎంఎస్సీ మేథ్స్‌లో 40, ఎంఎస్సీ ఫిజిక్స్‌లో 30, ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీలో 30, ఎంఎస్సీ బోటనీలో 30, ఎంఎస్సీ కంప్యూటర్స్ సైన్స్‌లో 30 ఖాళీలు కలిపి మొత్తం 340 సీట్లు ఉన్నాయన్నారు.

యూజీలో...

యజీలో బీఏ హానర్స్ (ఎకనామిక్స్) 40, బీఏ హానర్స్ హిస్టరీ 40, బీఏ హానర్స్ పొలిటికల్ సైన్స్, బీకాం కంప్యూటర్స్ 120, బీఎం జనరల్ 60, బీఎస్సీ బయోటెక్నాలజీ 40, బీఎస్సీ 40, బీఎస్సీ బోటనీ 40, బీఎస్సీ కెమిస్ట్రీ 40, బీఎస్సీ కంప్యూటర్స్ సైన్స్ 40, బీఎస్సీ మేథ్స్ 40, బీఎస్సీ ఫిజిక్స్ 40, బీఎస్సీ మైక్రోబయాలజీ 40, బీఎస్సీ జూవాలజీ 40, బీబీఏ డిజిటల్ మార్కెటింగ్ 40, బీబీఏ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ 40, బీబీఏ రిటైల్ ఆపరేషన్స్ 40 కలుపుకుని మొత్తం 800 సీట్లు ఖాళీగా ఉన్నాయి.

నాణ్యమైన విద్యే లక్ష్యం



నాణ్యమైన విద్య తమ కళాశాలలో అందుబాటులోకి తెచ్చాం. మౌలిక వసతుల కల్పనపై శ్రద్ధ వహిస్తున్నాం. ఇటీవల కళాశాలలో నూతనంగా రికార్డింగ్ రూమ్ సిస్టమ్ తీసుకు వచ్చాం. కళాశాల వెబ్‌సైట్‌లోని ఆన్‌లైన్ ద్వారా ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకున్న అనంతరం కళాశాలలోని వెబ్‌ఆప్షన్ అవకాశాన్నివిద్యార్థినుల ప్రవేశాలకు అవకాశం కల్పిస్తున్నాం. విద్యార్థినులు కళాశాలలో నేరుగా హెల్ప్ డెస్క్‌లో సంప్రదించవచ్చు. లేదా కళాశాల ఫోన్లు: 0891-2541156, 70322 70810ను సంప్రదించవచ్చు.

- విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ రోణంకి మంజుల

అనాథ పిల్లలకు కల్కి సినిమా ఉచిత ప్రదర్శన..



పిల్లలకు ఉచిత ప్రదర్శనలో సీపీ శంఖబ్రత బాగ్చి

డాబాగార్డెన్, జూలై 14: అనాథ పిల్లలను ఆదివారం కల్కి 2898 ఏడీ చిత్రాన్ని జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ జేసీఐ ఆధ్వర్యంలో ఉచిత ప్రదర్శనకు తీసుకెళ్లారు. నగరంలోని పలు థియేటర్లలో వీరికి చిత్రాన్ని చూపించారు. ఈ కార్యక్రమానికి నగర పోలీస్ కమిషనర్ శంఖ బ్రత బాగ్చి హాజరై పిల్లలతో ముచ్చటించారు. అనంతరం కొంతసేపు పిల్లలతో చిత్రాన్ని వీక్షించారు. అనాథలకు ఆహ్లాదకరమైన విద్య, వినోద అనుభవాన్ని అందించడానికి జేసీఐ వైజాగ్ పోర్ట్ అమిగోస్ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషకరమన్నారు. జేసీఐ ప్రెసిడెంట్ భార్గవ్‌మహర్షి మాట్లాడుతూ గత నాలుగేళ్లగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సంతోష్‌కుమార్, పూర్వ అధ్యక్షులు మాధురి , చంద్రమౌళి, సాయివర్మ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

అక్కయ్యపాలెం, జూలై 14 : శ్రీ నందగిరినగర్ సేవా సంఘం, లక్ష్మీ గాయత్రి హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో 44వ వార్డు నందగిరినగర్‌లో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ అధినేత డాక్టర్ కేవీ రామ్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానికులకు బీపీ, షుగర్‌తో పాటు వివిధ రకాల పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం రామ్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు జయకుమార్, అధ్యక్షుడు బొడ్డేటి ప్రకాష్, ఉపాధ్యక్షుడు గేదెల వెంకన్న, సెక్రటరీ బసవ గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్మాతిక చింతనతోనే జీవితానికి సార్థకత



మాట్లాడుతున్న మాతాజీ మోహిని ఆహుజా

పూర్ణామార్కెట్, జూలై 14: ఆధ్మాత్మిక చింతనతోనే మానవ జీవితం సార్థకమవుతుందని సంత్ నిరంకారీమాతాజీ మోహిని ఆహుజా హితవు పలికారు. ఆదివారం వన్‌టౌన్ వాసవీ కల్యాణ మండపంలో సంత్ నిరంకారీ మిషన్ విశాఖ ఆధ్వర్యంలో ఆధ్మాత్మిక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మాతాజీ సంత్ నిరంకారీమిషన్ సభ్యులు బ్రహ్మజ్ఞానం, ఉపదేశాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. సత్‌పురుషుల సాంగత్యం విశిష్టత, సదుర్గువుద్వారా పరమాత్మ అనుభూతి పొందవచ్చని తదితర అంశాలపై ఉపదేశం చేశారు. ఈ కార్యక్రమాన్ని విశాఖ శాఖ సంయోజకులు ప్రేమ్ రామ్‌చంద్, జ్ఞాన ప్రచారకులు పి.వి.రావు, పిఎస్‌రాజు, క్షేత్రీయ సంచాలకులు రవి పాల్గొన్నారు. రాజ్ వీర్ సింగ్ పర్యవేక్షించారు. మహిళా సభ్యులు పాల్గొన్నారు.

చెస్ టోర్నీలో ప్రతిభ చూపిన చిన్నారులు



విజేతలుగా నిలిచిన చిన్నారులు

విశాఖపట్నం (స్పోర్ట్సు): ఆల్ వైజాగ్ చెస్ సంఘం నిర్వహించిన అండర్-7 ఓపెన్, బాలికల చదరంగం పోటీల్లో సుమారు 50 మంది చిన్నారులు అద్భుత ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు. నగరంలో ఆదివారం జరిగిన టోర్నీ ఓపెన్ కేటగిరిలో అల్లు సృజై, జి.లక్షిత్, బాలికల విభాగంలో మనస్వి నక్కల, ఎన్.లాలిత్య విజేతలుగా నిలిచారు. వీరికి ఆల్ వైజాగ్ చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ బాబూరావు ముఖ్య అతిథిగా పాల్గొని ధ్రువపత్రాలు అందజేసి అభినందించారు. ఈ విజేతలు విజయనగరంలో జరిగే రాష్ట్ర స్థాయి టోర్నీలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని కార్యదర్శి ఎస్.మణికంఠరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్బిటర్ రవిజేత పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రతిభ చూపితే గుర్తింపు



ఎంపిక కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఈడీ రవికుమార్

ద్వారకాకాంప్లెక్సు, జూలై 14: క్రీడల్లో ప్రతిభ చూపితే మంచి గుర్తింపు ఉంటుందని ఆర్టీసీ విజయనగరం జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.రవికుమార్ అన్నారు. ఆర్టీసీ అథ్లెటిక్స్ మీట్-24కు సంబంధించి విజయనగరం జోన్ అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక కార్యక్రమాన్ని కైలాసగిరి పోలీస్ గ్రౌండ్‌లో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అథ్లెటిక్స్ మీట్ -24లో షాట్‌పుట్, జావిలిన్ త్రో, డిస్కస్ త్రో, రన్నింగ్, లాంగ్ జంప్, వంటి ఈవెంట్స్ ఉంటాయన్నారు. విజయనగరం జోన్ నుంచి ఒక్కో ఈవెంట్‌కు ఇద్దరేసి క్రీడాకారుల చొప్పున ఎంపిక చేసి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు పంపుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ అంధవరపు అప్పలరాజు, విజయనగరం జోన్ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ (కమర్షియల్ అండ్ ఆపరేషన్స్) బి. అప్పలనాయుడు, జోన్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ సుధాబిందు, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ కణితి వెంకటరావు పాల్గొన్నారు.



బాలలతో కోచ్ సంతోష్, పార్కు ప్రతినిధులు

రోల్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు

మురళీనగర్; మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్సు పార్కులో ఆదివారం 4వ జిల్లా స్థాయి రోల్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఘనంగా నిర్వహించారు. 11,14, 17 ఏళ్ల లోపు ఆపై దాటినవారికి వేర్వేరుగా పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర పోలీసు కమిషనరు శంఖబ్రత బాగ్చీ హాజరయ్యారు. విజేతలకు బహుమతులందించారు. వైశాఖీ పార్కులో అమర్చిన సీసీ కెమెరాలను ప్రారంభించారు. పార్కు కమిటీ అధ్యక్షులు సనపల.వరప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది పృథ్వీరాజ్, ఉపాధ్యక్షులు పల్లా.చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి పి.వి.సూర్యనారాయణ, రోల్ బాల్ స్కేటింగ్ కోచింగ్ నిర్వాహకులు సంతోష్ తదితరులు ఉన్నారు.

పోలియో రహిత సమాజానికి రోటరీ కృషి



రోటరీ సర్టిఫికెట్స్ అందజేస్తున్న డిస్ట్రిక్ గవర్నర్ రవి వడ్లమాని

జగదాంబ కూడలి, జూలై 14: పోలియో రహిత సమాజానికి రోటరీ విశేష కృషి చేస్తున్నట్టు రోటరీ డిస్ట్రిక్ గవర్నర్ వడ్లమాని రవి అన్నారు. నగరంలో ఓ హోటల్ జరిగినసమావేశంలోఆయన మాట్లాడారు.పలు వైద్య సేవలందజేస్తున్నట్టు చెప్పారు.

రోటరీ డిస్ట్రిక్ట్ నూతన కార్యవర్గం ఎంపిక

ఈ సమావేశంలో రోటరీ డిస్ట్రిక్ట్ 24-25 నూతన కార్యవర్గం ఎంపికైంది. డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ గవర్నర్‌గా ఎ. దర్మసాయి, అధ్యక్షుడిగా కె.వి.రమణ, కార్యదర్శిగా కైలాష్ అగర్వాల్ ప్రమాణ స్వీకారం చేశారు.ఈసందర్భంగా రోటరీ సభ్యులకు సర్టిఫికెట్లందజేశారు.

చీటిల పేరుతో మోసం.. బాధితుల ఆందోళన



బాధితులతో మాట్లాడుతున్న పోలీసులు

ఆరిలోవ, జూలై 14 : ఆరిలోవలోని లక్ష్మీనగర్‌కు చెందిన అయితి లక్ష్మీ చీటి పేరుతో మోసం చేయడంతో బాధితులు ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. ఆమె సుమారు రూ. 5 కోట్ల వరకూ మోసం చేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. లక్ష్మి ఆరేళ్లుగా చీటిల వ్యాపారం చేస్తోంది. మొదట్లో తక్కువ మొత్తంలో చీటిలు వేసి నమ్మకంగా ఉండేది. చీటి డబ్బులను పాటదారులకు సకాలంలో అందజేసేది. దీంతో ఆమెపై నమ్మకం పెరగడంతో చాలామంది చీటిలు వేశారు. దీన్ని ఆసరాగా తీసుకున్న ఆమె పాటదారులకు అధిక వడ్డీ ఆశ చూపించి, పాడిన డబ్బులు ఇవ్వకుండా కాలయాపన చేయడం మొదలుపెట్టింది. అలా చాలా మందికి పాట డబ్బులు ఎగ్గొట్టడంతో అనుమానం వచ్చి పాటదారులంతా ఆమెను నిలదీశారు. దీంతో ఆమె తన దగ్గర ప్రస్తుతం డబ్బులు లేవని, వీలు చూసుకుని ఇస్తానని చెప్పడంతో బాధితులంతా ఆమె ఇంటి వద్ద ఆందోళన చేశారు. ఈమేరకు ఆమె ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు వచ్చి బాధితులను సముదాయించారు. ఆందోళన చేయడం సరి కాదని ఏదైనా ఉంటే స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలనంతో ఆదివారం వారు లక్ష్మిపై ఫిర్యాదు చేశారు. తన వద్దప్రస్తుతండబ్బులులేవని,ఇల్లుఅమ్మి చెల్లిస్తానని లక్ష్మి చెప్పడంతో బాధితులు శాంతించారు.

ముగిసిన వారాహి మహోత్సవాలు



అమ్మవారి పూజల్లో భక్తులు

అల్లిపురం, జూలై 14 : అల్లిపురం ప్రియాంక విద్యోదయ పాఠశాల సమీపాన శ్రీ సాయి శ్రీ మేరు ట్రస్ట్ ఆధ్వర్యంలో లోక కళ్యాణార్థం సాయి దర్బార్ ప్రాంగణంలో కొన్ని రోజులుగా నిర్వహించిన వారాహి నవరాత్రి మహోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. అర్చకులు భక్తుల సమక్షంలో సన్నిధిలోని అనఘాలక్ష్మి వారాహి రాజశ్యామల అమ్మవార్లకు అభిషేకం, ప్రత్యేక పూజలతో ఈ ఉత్సవాలు ఘనంగా ముగిశాయి.

ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ

జ్ఞానాపురం, జూలై 14:గ్రేటర్ 41వ వార్డు పరిధి జ్ఞానాపురంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు ఐతి మధుబాబు ఆధ్వర్యంలో ఆదివారం ఉచితంగా కళ్ల జోళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దక్షిణ నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ పాల్గొని వీటిని అందించారు. రవిబాబు, దుక్కా ప్రసాద్, శ్రీధర్, పి.రాజ్‌కుమార్, జనసేన నాయకులు గవర రమణ, కర్రి బానోజీ పాల్గొన్నారు.

విశాఖ భూ దందాపై ప్రభుత్వం ఫోకస్!

... 5వ పేజీ తరువాయి

ఒప్పందాలు చేసుకుని, అడ్వాన్సులు ఇచ్చి 500 నుంచి 600 ఎకరాలను రిజిస్టర్ చేసుకున్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు పరిసరాల్లోని భీమిలి మండలంలో పలువురు రైతులను బెదిరించి భూములు కొట్టేశారు. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి దృష్టి సారించడంతో విశాఖలో భూదందాలపై విశాఖ ఫైల్స్ పేరిట నివేదిక విడుదల చేస్తామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదివారం ప్రకటించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇప్పటికే భీమిలి నియోజకవర్గంలో పలు ఆక్రమణలు, కబ్జాలపై ఆయన కొంత సమాచారం సేకరించారు.

అనకాపల్లి జిల్లా కశింకోట మండలం విస్సన్నపేటలో సుమారు 600 ఎకరాల భూ దందాపై ఇప్పటికే జిల్లా టీడీపీ నేతలు ముఖ్యమంత్రికి నివేదించారు. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో కొందరు అనుచరులు విస్సన్నపేట భూములు చేజిక్కించుకున్నారన్నది ప్రధాన అభియోగం. ఈ భూముల్లో కొంతవరకు ప్రభుత్వ అసైన్డ్, మిగులు భూములతోపాటు గెడ్డలు, వాగులు, రహదారులు ఉన్నాయి. దీనికితోడు విస్సన్నపేటలో భారీగా వనరుల విధ్వంసం జరిగింది. కాగా అనకాపల్లిలోని నాతవరం మండలం భమిడికలొద్దిలో లక్షల క్యూబిక్ మీటర్ల లేటరైట్ తవ్వేశారు. అటవీ భూములు స్వాధీనం చేసుకుని చెట్లు కొట్టేసి, రోడ్లు వేసి లోపలకు ఎవరినీ అనుమతించకుండా ఒక మాఫియాను నడిపించారు. భమిడికలొద్దిలో తవ్వింది బాక్సైట్ గనులే అయినా లేటరైట్ పేరుతో తవ్వుకుని సొమ్ము చేసుకున్నారు. ఇక అనకాపల్లి మండలంలో మెటల్ క్వారీలను లీజుదారుల నుంచి బలవంతంగా స్వాధీనం చేసుకుని వేల క్యూబిక్ మీటర్లు తవ్వేశారు. ఈ భూ దందాలు, గనుల దోపిడీకి సంబంధించి వివరాలను అనకాపల్లి జిల్లా పార్టీ నాయకులు ముఖ్యమంత్రికి నివేదించారు.

ముడసర్లోవ పార్కులో హార్స్ రైడింగ్ ప్రాజెక్టు

... 5వ పేజీ తరువాయి

పార్కులో పక్షులఆవాసానికి ఇబ్బందులు తలెత్తడంతోపాటు, వాటి జీవనం కూడాప్రశ్నార్థకంగా మారుతోందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

స్పందించిన డిప్యూటీ సీఎం

ఈ మేరకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, పర్యావరణవేత్త ఈఏఎస్ శర్మ రాష్ట్ర ప్రభుత్వానికి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు లేఖ కూడా రాశారు. ముడసర్లోవపార్కులో జరుగుతున్న పనులను తక్షణం నిలిపివేయాలని, 105 రకాల జీవజాతుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని అందులో కోరారు. ఈ లేఖపై డిప్యూటీ సీఎం కార్యాలయ అధికారులు స్పందించి జీవీఎంసీ అధికారులను వివరణ కోరినట్టు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికైనా అధికారులు పనులు నిలిపివేసి, హార్స్‌రైడింగ్ ప్రాజెక్టును మరో ప్రాంతానికి తరలించాలని పర్యావరణ వేత్తలతో పాటు, నగర వాసులు కోరుతున్నారు.

కేజీహెచ్ కథ మారేనా?

... 5వ పేజీ తరువాయి

ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వార్డుబాయ్‌లు సక్రమంగా పనిచేయకపోవడం, డబ్బులు డిమాండ్ చేయడం, లేదంటే రోగిని పట్టించుకోకపోవడం లాంటి సంఘటనలున్నాయి. వార్డుల్లో చేరేందుకు, పరీక్షల నిమిత్తం వార్డుల నుంచి ల్యాబ్‌లు, ఇతర పరీక్ష కేంద్రాలకు వెళ్లేందుకు రోగుల సహాయకులే వీల్‌చైర్లు, స్ట్రెచర్లపై తరలించాల్సిన దుస్థితి ఎదురవుతోంది. దీనిపై ఎన్ని ఫిర్యాదులు చేసినా అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని రోగుల బంధువులు విమర్శిస్తున్నారు. అడపాదడపా చర్యలు తీసుకున్నా సిబ్బంది పని తీరులో ఎలాంటి మార్పు కనిపించడం లేదు.

తాగు నీటికీ సమస్య..

కేజీహెచ్‌లోని అనేక విభాగాల్లో తాగునీటి సమస్య వేధిస్తోంది. దాతల సహకారంతో ఏర్పాటు చేసిన కూలర్లు నిర్వహణ లేక పనిచేయడం లేదు. దీంతో రోగుల బంధువులు బయటి నుంచి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోంది. ఆస్పత్రిలోని ఆర్వో ప్లాంటు వద్ద నీటి సరఫరా ఆశించినస్థాయిలో జరగడం లేదు. దీనికితోడు మరుగుదొడ్లు అధ్వానంగా మారడంతో పరిస్థితి అస్తవ్యస్తంగా మారుతోంది. నిర్వహణను సిబ్బంది పట్టించుకోకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో రోగులతో పాటు వారి సహాయకులు అవస్థలు పడుతున్నారు.

మంత్రి పర్యటనపై ఆశలు

ఆరోగ్యశాఖా మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత మొదటి సారిగా సత్యకుమార్ యాదవ్ కేజీహెచ్‌కు రానున్నారు. కేజీహెచ్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించనున్న నేపథ్యంలో ఆస్పత్రి అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలపై చర్చించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఏళ్లుగా పేరుకుపోయిన సమస్యలకు చెక్ పెడతారని, వైద్యులు, సిబ్బంది పనితీరులో మార్పులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనికి తోడు ఆస్పత్రి అభివృద్ధికి సంబంధించి కొన్ని ప్రతిపాదనలను అధికారులు మంత్రికి నివేదించనున్నారని సమాచారం.

ఎర్నిమాంబకు మొక్కులు తీర్చిన టీడీపీ శ్రేణులు

కంచరపాలెం, జూలై 14 : ఇటీవల జరిగిన ఎన్నికల్లో టీడీపీ గెలుపొంది చంద్రబాబు ముఖ్యమంత్రిగా పదవీ స్వీకారం చేయడంతో జ్ఞానాపురం ఎర్నిమాంబకు 48వ వార్డు ఆపార్టీ కార్యకర్తలు మొక్కులు తీర్చారు. వార్డుకు చెందిన నాళం సర్వేశ్వరరావు దంపతులు, కార్యకర్తలు టీడీపీ అధికారంలోకి రావాలని అనేక పూజలు నిర్వహించారు. అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రిగా అయితే, అమ్మవారి పండగ చేస్తామని మొక్కుకున్నారు. సర్వేశ్వరరావు దంపతులు ఆదివారం మొక్కును చెల్లించుకున్నారు. ఈ పార్టీ విజయానికి కృషిచేసిన వారిని సత్కరించారు. వార్డు సీనియర్ నాయకుడు గొర్లె అప్పారావును ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.


మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

ప్రమాద బాధిత కుటుంబీకులకు పల్లా పరామర్శ

అగనంపూడి, జూలై 14: గాజువాక పంతులగారి మేడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తల్లీ, కుమార్తెలు జాజుల పార్వతి, సత్యవతిలకు ఆదివారం స్థానిక శ్మశాన వాటిక వద్ద అంత్యక్రియలు నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కుటుంబానికి అండగా ఉంటామని పల్లా భరోసా ఇచ్చారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి: జనసేన


జనవాణిలో సమస్యలు తెలుపుతున్న ప్రజలు

సింధియా, జూలై 14: ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం చూపతామని జనసేన రాష్ట్ర కార్యదర్శి అంగ దుర్గా ప్రశాంతి అన్నారు. జీవీఎంసీ 63వ వార్డులో ఆదివారం నిర్వహించిన జనసేన జనవాణి కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జనవాణి ద్వారా తమ దృష్టికి వచ్చిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. వార్డు జనసేన అధ్యక్షుడు శివ గొరిపూటి, ప్రధాన కార్యదర్శి నానాజీ, మహిళా అధ్యక్షురాలు దాడి లలిత, వార్డు యువజన అధ్యక్షుడు లోకొండ ప్రదీప్ పాల్గొన్నారు.

అతిసారపై ముందు జాగ్రత్తలు అవసరం

కూర్మన్నపాలెం, జూలై 14: అతిసార బారిన పడకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ సూచించారు. 87వ వార్డులోని లక్ష్మీపురం కాలనీలో ఆదివారం నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన మాట్లాడారు. చిన్నారులకు వేడిగా ఉండే ఆహారం, నీటిని ఇవ్వాలని, వేడి చేసి చల్లార్చిన ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగించాలని చెప్పారు. అలాగే పరిసరాలు, వ్యక్తిగత శుభ్రతను పాటించాలని చెప్పారు. పిహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

17న ఉమ్మడి విశాఖ సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక

కూర్మన్నపాలెం, జూలై 14: కణితి ఉన్నత పాఠశాలలో ఈ నెల 17న ఉమ్మడి విశాఖ జిల్లా సాఫ్ట్‌బాల్ సీనియర్ జట్ల (పురుషులు, మహిళలు) ఎంపికలు జరుగుతాయని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రమణ, ఎన్.సూర్య తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్ కార్డు, మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 9885659016, 7396542409 సంప్రదించాలని ఆయన సూచించారు.

మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన

పెదగంట్యాడ, జూలై 14: అప్పికొండ గ్రామంలో ఆదివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. 77వ వార్డు జనసేన ప్రధాన కార్యదర్శి గరికిన మహేష్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. యువకులు ఇలాంటి శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లను అందజేశారు. శ్రీసోమేశ్వరస్వామి యూత్ సభ్యులు కమల్‌హసన్, కొండయ్య, కోదండరావు, మహేష్ పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలతో ఉక్కు పరిరక్షణ సాధ్యం

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ ఆదినారాయణ

కూర్మన్నపాలెం, జూలై 14: ప్రజా పోరాటాలతో ఉక్కు పరిరక్షణ సాధ్యమని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. కూర్మన్నపాలెంలో ఆదివారం విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల శిబిరం 1249 రోజులకు చేరుకొంది. ఈ శిబిరంలో పాల్గొన్న ఆయన కార్మికుల ఉద్దేశించి మాట్లాడారు. ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారం దిశగా అడుగులు వేయాలన్నారు. విశాఖ స్టీలు ప్లాంటును రక్షించుకోవటానికి ఎంతటి త్యాగాలుకైనా వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ మూడు నెలలుగా కాంట్రాక్టు కార్మికులకు జీతాలు ఇవ్వలేదని, ఉత్పత్తికి సరిపడా మెటీరియల్ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్టీలుప్లాంటు సాధారణ ఉత్పత్తి దిశగా నడిచేందుకు, కార్మికుల వేతనాలు సకాలంలో అందించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.రామారావు, రామస్వామి, పిట్టారెడ్డి, కేఎస్ఎన్.రావు, ఎన్.రామచంద్రరావు, కె.శ్రీనివాస నాయుడు, నరేంద్ర, గోపి, ప్రసాద్, ఉద్యోగులు పాల్గొన్నారు.


రిలే నిరాహార దీక్షల శిబిరంలో పాల్గొన్న ఉక్కు ఉద్యోగులు

ఉక్కు రిలే నిరాహారదీక్ష షెడ్యూల్ మార్పు

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో భాగంగా చేపడుతున్న రిలే నిరాహారదీక్ష షెడ్యూల్‌లో మార్పులు చేశారు. 22న ఏఐటీయూసీ, 23న ఇంటక్, 24న సీఐటీయూ, 25 ఏఐటీయూసీ, 26 ఇంటక్, 27న సీఐటీయూ, 28న హెచ్ఎంఎస్ కాంట్రాక్టు కార్మికులు, 29న ఏఐటీయూసీ, 30న ఇంటక్, 31న సీఐటీయూ యూనియన్ ప్రతినిధులు దీక్షలో కూర్చోనున్నారు.

మిజోరం గవర్నర్‌ను కలిసిన కరణంరెడ్డి



గాజువాక, జూలై 14: విశాఖ విమానాశ్రయంలో మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబుకు గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు కలిశారు. గాజువాక ప్రాంతంలో పర్యటించాలని గవర్నర్‌ను కోరానని, తాను గాజువాకలో చేసిన సేవా కార్యక్రమాలను వివరించానని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. వీటిని భవిష్యత్‌లో మరింత విస్తరిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

హోం మంత్రిని కలిసిన రతన్‌కాంత్



గాజువాక, జూలై 14: రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితను టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్.రతన్‌కాంత్ ఆదివారం నగరంలోని మర్యాదపూర్వకంగా కలిశారు. వైసీపీ ప్రభుత్వం అక్రమంగా కేసులు పెట్టిందని, ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాడితే దుర్మార్గంగా వ్యవహరించిందని చెప్పారు. నాడు విద్యార్థులు, నిరుద్యోగులపై అన్యాయంగా పెట్టిన కేసులను ఉపసంహరించాలని కోరినట్టు ఆయన చెప్పారు.

కృష్ణావతారంలో జగన్నాథస్వామి



అగనంపూడి, జూలై 14: రథయాత్ర ఉత్సవాల్లో ఇక్కడి జగన్నాథస్వామి ఆదివారం కృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక ఇంద్రజ్యూమ్న మందిరంలో కొలువుదీరిన జగన్నాథస్వామి, సుభద్ర, బలభద్రలను అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. పరిసర ప్రాంత గ్రామాలకు చెందిన భక్తులకు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. సోమవారం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు కె.పైడిరాజు, జి.సాయికుమార్, నాగేశ్వరరావు, నాగమణి, కుమారి, వరదరాణి ఆలయ మేనేజర్ జగన్నాథరావు, 79వ వార్డు టీడీపీ మహిళా అధ్యక్షురాలు జి.కనకభవానీ పాల్గొన్నారు.

వారాహి మాతకు ప్రత్యేక పూజలు

కూర్మన్నపాలెం, జూలై 14: జీవీఎంసీ 87 వార్డు కూర్మన్నపాలెంలోని సంపత్ వినాయక ఆలయంలో ఆదివారం వారాహి దేవీకి ప్రత్యేక పూజలు, హోమాలు జరిగాయి. ప్రధాన అర్చకులు శివాజీ శర్మ ఆధ్వర్యంలోఅమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


ప్రత్యేక అలంకరణలో వారాహిమాత అమ్మవారు

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో వీలీనం చేయాలని దీక్ష

ఉక్కుటౌన్‌షిప్, జూలై 14: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో వీలీనం చేయాలని ఉక్కు అధికారుల సంఘం (సీ) ఆధ్వర్యంలో ఆదివారం సీ భవన్ వద్ద దీక్ష చేపట్టారు. తొలుత కొవ్వొత్తుల జంక్షన్ వద్ద ఉక్కు అమరవీరులకు నివాళులర్పించారు. అక్కడ నుంచి సీ భవన్‌కు ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ముడి పదార్థాలు కొనలేక పూర్తి స్థాయి ఉత్పత్తి జరగక ఇబ్బందులు వస్తున్నాయన్నారు. ఇటీవల స్టీల్‌ప్లాంట్ విచ్చేసిన కేంద్రమంత్రిని కలిసి సమస్యలను విన్నవించామని చెప్పారు. కార్యక్రమంలో సెఫీ ఛైర్మన్ నరేంద్రకుమార్ బంచోర్, ప్రధాన కార్యదర్శి అబాకష్‌మాలిక్, బిలాయ్ ప్లాంట్ సీ ప్రధాన కార్యదర్శి పరవీందర్‌సింగ్, ఉక్కు అధికారుల సంఘం అధ్యక్షుడు చంద్రరావు, ప్రధాన కార్యదర్శి కేవీడీ.ప్రసాద్, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రతినిధులు బయ్యే మల్లయ్య, తౌడన్న, కార్మిక నాయకులు డి.ఆదినారాయణ, కెఎస్ఎన్.రావు, మంత్రి రాజశేఖర్, రామస్వామి పాల్గొన్నారు.

అధికారుల దృష్టికి ప్రజల సమస్యలు


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

పెదగంట్యాడ, జూలై 14: ప్రజల సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని విశాఖపార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి అన్నారు. సీతానగరం ఎన్టీఆర్ జంక్షన్‌లో 75వ వార్డు టీడీపీ కమిటీ ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేయాలని సూచించారు. పొరపాట్లు జరిగితే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుందామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ములకలపల్లి పెంటయ్య, మొల్లి రమణబాబు, మొల్లి సింహాద్రి, ఎస్ ఈశ్వరరావు, ఎన్ రమణ, దుర్గా ఆటో స్టాండ్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి పైపుల లీకులకు సిబ్బంది అడ్డుకట్ట

సింధియా, జూలై 14: జీవీఎంసీ 63వ వార్డు పరిధిలోని జై ఆంధ్రా కాలనీలోని తాగునీటి పైపులైన్ల లీకులను జీవీఎంసీ అధికారులు ఆదివారం అరికట్టారు. ఎక్కడికక్కడ పైపులైన్లు లీకైన కారణంగా కాలనీ వాసులకు తాగునీరు తగినంత అందడం లేదని వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నకు ఫిర్యాదులు అందడంతో జీవీఎంసీ సిబ్బందిని పిలిపించి దగ్గరుండి లీకులు సరి చేయించారు. కార్పొరేటర్ వెంట స్థానిక నాయకులు రేగిపల్లి బాబూరావు, పొక్కుల రాజారావు తదితరులు ఉన్నారు.

చంద్రబాబును కలిసిన డాక్‌యార్డ్ ఉద్యోగులు

పెందుర్తిరూరల్, జూలై 14: డాక్‌యార్డ్ ఉద్యోగుల ఓవర్ టైమ్ గంటలు పెంచాలని కోరుతూ పలువురు కార్మికులు, యూనియన్ నాయకులు శనివారం మంగళగిరి టీడీపీ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కలసి వినతి పత్రమిచ్చారు. ముంబాయి డాక్‌యార్డ్‌లో ఒకొక్క కార్మికునికి నెలకు 50గంటల ఓటీ కల్పిస్తున్నారని, విశాఖ డాక్‌యార్డులో 38 గంటలకే పరిమితం చేసినట్టు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. ఐ.ఎన్.సి.ఇ, ఇంటాక్ నాయకులు బి. చిన్నారెడ్డి, బోగస్, బంగారురాజు, వాసు, శంకరరావు, రమణ, రాంబాబు బాబును కలిసిన వారిలో ఉన్నారు.

శ్రమశక్తినగర్ కార్యవర్గం ఎన్నిక

పెందుర్తి, జూలై 14: చినముషిడివాడలోని శ్రమశక్తినగర్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఆదివారం పోర్టు కల్యాణ మండపంలో జరిగిన ఈ ఎన్నికల్లో కాలనీకి చెందిన రెండు ప్యానల్స్ పోటీచేయగా ఓ ప్యానెల్ కార్యవర్గం గెలుపొందింది. శ్రమశక్తినగర్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సీహెచ్ రమణమూర్తి, వి.శంకర్‌ప్రసాద్, కమ్యూనిటీ హాల్ ట్రెజరర్‌గా జి.జనార్దనరావు ఎన్నికయ్యారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మీ సేవ భవనం

- ఐదేళ్లుగా నిరుపయోగం
- ఫర్నీచర్ మాయం
- ఆకతాయిలు మద్యం, గంజాయి సేవనం

మల్కాపురం, జూలై 14: శ్రీహరిపురం జీవీఎంసీ ఆస్పత్రికి అనుకొని ఉన్న మీ సేవ కేంద్ర భవనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. వైసీ పీ పాలనలో ఏడువార్డులకు సంబంధించిన ఈ మీ సేవ కేంద్రం మూతపడింది. ప్రస్తుతం ఈ కేంద్రంలోని వస్తువులన్నీ దొంగలపాలయ్యాయి. తలుపులు, కిటికీలు, ఫ్యాన్‌లు, కుర్చీలు, టేబుల్‌లు, బల్లలు ఇ లా దాదాపు అన్నీ అపహరణకు లోనయ్యాయి. అలాగే, ప్రస్తుతం ఈ కేంద్రం చెత్తకుండీని తలపిస్తోంది. ఈ భవనాన్ని ఏదో ఒక ప్రభుత్వ కార్యాలయానికి ఉపయోగించుకుంటే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కానీ అధికారులెవరూ పట్టించుకోకపోవడంతో కొంతమంది అకతాయిలు ఈ కేంద్రంలో చేరి గంజాయి, మద్యం సేవించడం తదితర పనులకు పాల్పడుతున్నారు. ఐదేళ్లగా మూతపడి ఉన్నా ఈ భవనంపై జీవీఎంసీ అధికారుల దృష్టి సారించకపోవడం గమనార్హం. దీంతో విలువైన సామగ్రిని తస్కరించుకు పోయారు. ఇక్కడ కొంతమంది యువలకు చేరుకుని అసాంఘి కార్యకలాపాలకు పాల్పడుతుండడంతో పరిసర ప్రాం తాల వారు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు.


చిందరవందరగా మీ సేవ కేంద్రంలోపల భాగం


మాయమైన కిటికీలు

తహసీల్దార్ కార్యాలయంగా మార్చాలి

గతంలో ఏడువార్డుల ప్రజలకు ఎంతగానో ఉపయోగపడే ఈ భవనం ఇలా వృథాగా వదిలేయడంపై స్థానికు లు విచారం వ్యక్తంచేస్తున్నారు. ములగాడ హౌసింగ్ కాలనీలో ఉన్న తహసీల్దార్ కార్యాలయాన్ని ఇక్కడకు తరలిస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం మండల రెవెనూ కార్యాలయం ఇరుకు గదుల మధ్య కొనసాగుతోంది. ఈ మీసేవ భవనంలోకి మార్చితే ఏడువార్డుల ప్రజలకు అందుబాటులో ఉంటుందని అం టున్నారు. ఈ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సినిమా గైడ్

● **భారతీయుడు-2:** జగదాంబ, శారద, మెలోడి, రమాదేవి, సంగం, వెంకటేశ్వర-1, కిన్నెర, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక) శ్రీకన్య సినీపోలీస్ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-1 (పెందుర్తి).

● **కల్కి:** శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), శ్రీకన్య, గణేష్, సప్తగిరి (తగరపువలస)

● **సారంగదరియా:** శ్రీవెంకటేశ్వర, శ్రీ నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు37, టమాటా 48, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 26, పచ్చిమిర్చి 70, కాకరకాయలు 40, బీరకాయలు 30, ఆనపకాయలు 14, కాలీఫ్లవర్ 42, క్యాబేజ్ 32, క్యారెట్ 30, దొండకాయలు 30, బంగాళదుంపలు 32, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 120, అల్లం (పాతది) 140, బరబాటి 32, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 50, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23,బీన్స్ (పెన్సిల్) 100, పొటల్స్ 40, కీరదోస 32, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 38, చిలగడదుంపలు 36, కంద 60, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4,పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడిఅల్లం70, బొప్పాయి28,జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	95
ఫారం ధర	--	115
విత్ స్కిన్	--	200
స్కిన్‌లెస్	--	210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 8 లో..

ఘనంగా మరిడిమాంబ అనుపోత్సవం


అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు తదితరులు

వేపగుంట జూలై 14: వేపగుంట దరి వరలక్ష్మీనగర్‌లో కొలవైన శ్రీ మరిడిమాంబ పండగ అను పో త్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మ వారికి ప్రత్యేక ఆలంకరణల్లో కుంకుమ పూజలు, అర్చ నలు చేశారు. ఈ పూజల్లో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, టీడీపీ పెందుర్తి ఇన్‌చార్జి గండిబాబ్జీ పాల్గొన్నారు. కార్పొరేటర్ ము మ్మన దేముడు అమ్మవారిని దర్శించుకున్నారు. పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

యోగా గురువుకు పదవీ విరమణ వీడ్కోలు


యోగా గురువు మూర్తిని సన్మానిస్తున్న శిష్యులు

వేపగుంట జూలై 14: నాయుడుతోట, వేపగుంట పరిసర ప్రాంతవాసులకు గత ఎనిమిదేళ్లుగా ఉచితంగా యోగా శిక్షణ ఇస్తున్న నేవల్ స్టోర్స్ సీనియర్ అధికారి, యోగా గురువు కె.ఎస్.మూర్తిని ఘనంగా ఉద్యోగ పదవీ విరమణ సందర్భంగా ఆయన శిష్యులు వీడ్కోలు సభ నిర్వహించారు. నాయుడుతోట సాయిమాధవనగర్ సాయి మందిరంలో జరిగిన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు యోగా ద్వారా తమకు కలిగిన ప్రయోజనాలను వివరించారు. శిష్యులు సత్యనారాయణ, ప్రభాకర్, కుమార్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు


వార్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు, అధికారులు

పెందుర్తి, జూలై 14: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పనిచేస్తానని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. నగర పరిధి 97వ వార్డులో ఆదివారం ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన చేశారు. ఈసందర్భంగా వెంకటాద్రినగర్, టీచర్స్ లేఅవుట్ సంపత్ గణపతికాలనీ. భాస్కర్‌రెడ్డివీరానగర్ కాలనీల్లోని రహదారులు, డ్రైనేజీలు పరిశీలించారు. ప్రధాన రహదార్లు, కాలువలు అధ్వానంగా వాటిని పంచకర్ల గుర్తించారు. వీటి నిర్మాణానికి అంచానాలు సిద్ధం చేయాలని జెడ్సీని ఆదేశించారు. వీటిని నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కాలనీల్లో మౌలిక వసతులు కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నామన్నారు. రోడ్లు, కాలువలు నిర్మాణంతో పాటు విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం తదితర అంశాలను సమీక్షిస్తామన్నారు. కార్పొరేటర్ శేనాపతి వసంతశంకరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో టీడీపీ నేత అప్పలనాయుడు. వార్డు జనసేన అధ్యక్షుడు శేనాపతి సోమశేఖర్‌నాయుడు, బీజేపీ ఇన్‌ఛార్జి గొర్లె రామునాయుడు, అయిత సింహాచలం, డీబీఎల్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలుదారులకు ఇబ్బంది లేకుండా చూడాలి


రైతుబజారులో స్టాల్స్ పరిశీలిస్తున్న ఏడీఎం

ఎన్.ఎ.డి జంక్షన్ జూలై 14: జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం రైతుబజారును ఆదివారం మార్కెటింగ్ శాఖ ఏడీఎం యాసిన్ సందర్శించారు. ఈ సందర్భంగా రైతుబజారులో సబ్సిడీ రైస్, కందిపప్పు కౌంటర్ సేల్స్‌ను పరిశీలించారు. మిగిలిన స్టాల్స్‌లో రైతులతో మాట్లాడారు. వినియోగదారులకు ఇబ్బం దులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఓ వరహాలు, సహాయకుడు ప్రతాప్ పాల్గొన్నారు.

గంజాయి బ్యాచ్‌లను నిరోధించాలి: సీపీ



సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

జగదాంబ కూడలి, జూలై 14: గంజాయి బ్యాచ్‌లు, ఆకతాయిల ఆగడాలను నిరోధించాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశించారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. స్టేషన్‌లో పలు కేసులకు సంబంధించి ఆరా తీశారు. స్టేషన్ లో సివిల్ కేసుల్లో సిబ్బంది పాత్రపై ఆరా తీశారు. పెండింగ్ కేసులకు సంబంధించి రికార్డుల తనిఖీలు చేశారు. లా అండ్ ఆర్డర్‌కు సంబంధించి నమోదవుతున్న కేసుల వివరాలను అడిగితెలుసుకున్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. వన్‌టౌన్‌లో గస్తీ ముమ్మరం చేయాలని ఎస్‌ఐకి ఆదేశించారు. విధుల్లో సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.



కళాశాల గ్రంథాలయంలో విద్యార్థినులు



అధునాతన కంప్యూటర్ ల్యాబ్

బోధనలో టాప్.. ఫలితాల్లో మేటి

- ▸▸ దూసుకుపోతున్న విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల
- ▸▸ ఎన్ఏఏసీ ఏ ప్లస్ గ్రేడ్ సాధించిన తొలి కళాశాలగా గుర్తింపు
- ▸▸ రికార్డింగ్ రూమ్ .. గ్రంథాలయ సౌకర్యం
- ▸▸ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ప్రవేశాలు
- ▸▸ అందుబాటులో పీజీ 340, యూజీలో 800 సీట్లు

డాబాగార్డెన్స్, జూలై 14: నగరం మధ్యన పచ్చని చెట్లతో ఆహ్లాదకరమైన వాతావరణంలో విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. ఆధునిక పరిజ్ఞానం, అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధనతో విద్యార్థినులను తీర్చిదిద్దుతున్నారు. ఈ కళాశాలలో విద్య నభ్యసించి ఎంతో మంది ఉన్నత శిఖరాలు అధిరోహిస్తున్నారు. ఈ క్రమంలోనే దేశంలోనే ఎన్ఏఏసీ ఏప్లస్ గ్రేడ్ సాధించిన తొలి మహిళా డిగ్రీ కళాశాలగా గుర్తింపు పొందింది. స్వయం ప్రతిపత్తి హోదా కూడా పొందిన ఈ కళాశాలలో డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో మొదటి సంవత్సరంలో చేరాలనుకున్న విద్యార్థినులకు సింగల్ మేజర్ సబ్జెక్టు విధానంలో బీఏ, బీకాం , బీఎస్సీ గ్రూప్‌లకు సంబంధించి సుమారు 800 వరకు సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినులు ఈ నెల 20వ తేదీలోగా తమ పేర్లను తమ కళాశాల వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు.

నామ మాత్ర ఫీజులు

కళాశాలలోని అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నాణ్యతమైన విద్యాబోధన, ప్రభుత్వ నిర్ణయించిన నామమాత్రపు ఫీజుల సదుపాయంతో అన్ని వర్గాల విద్యార్థులకు చదువుకునేందుకు వీలుకల్పిస్తున్నారు. అలాగే, అత్యాధునిక పరికరాలతో కూడిన సైన్స్ ల్యాబ్‌లు, కంప్యూటర్ పరిజ్ఞానం ఇంగ్లీష్ ల్యాబ్ ద్వారా స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్ సదుపాయం, రీడింగ్ హాల్, వివిధ రకాలకు ఉపయోగపడే లైబ్రరీ విద్యార్థినులకు చేరువగా ఉన్నాయి.

వీడియో రికార్డింగ్ రూమ్ ..

ఇటీవలే కళాశాలలో వీడియో రికార్డింగ్ రూమ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. దీని ద్వారా అధ్యాపకులు అర్థవంతమైన, సులభ రీతిలో పాఠాలు బోధించేందుకుసిద్ధమవుతున్నారు. దీంతో పాటు అధునాతనంగా కంప్యూటర్స్‌ను వివిధ విభాగాల్లో ఏర్పాటు చేశారు. ఇప్పటికే కళాశాలలోని 1800 వరకు విద్యార్థినులు చదువుతున్నారు. 2024- 25 విద్యా సంవత్సరానికి పీజీలోని 800 సీట్లు, యూజీలోని 340 సీట్లు అందుబాటులోనున్నాయి.

పీజీలోని వివిధ గ్రూపుల్లో ఖాళీలు..



డిజిటల్ తరగతి గది

పీజీలోని ఎం.ఏ ఇంగ్లీష్‌లో 40 సీట్లు, ఎంఏ ఎకనామిక్స్‌లో 40, ఎకాంలో 40, ఎంఎస్సీ సైకాలజీలో 40, ఎంఎస్సీ మైక్రోబయాలజీలో 40, ఎంఎస్సీ మేథ్స్‌లో 40, ఎంఎస్సీ ఫిజిక్స్‌లో 30, ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీలో 30, ఎంఎస్సీ బోటనీలో 30, ఎంఎస్సీ కంప్యూటర్స్ సైన్స్‌లో 30 ఖాళీలు కలిపి మొత్తం 340 సీట్లు ఉన్నాయన్నారు.

యూజీలో...

యుజీలో బీఏ హానర్స్ (ఎకనామిక్స్) 40, బీఏ హానర్స్ హిస్టరీ 40, బీఏ హానర్స్ పొలిటికల్ సైన్స్, బీకాం కంప్యూటర్స్ 120, బీఎం జనరల్ 60, బీఎస్సీ బయోటెక్నాలజీ 40, బీఎస్సీ 40, బీఎస్సీ బోటనీ 40, బీఎస్సీ కెమిస్ట్రీ 40, బీఎస్సీ కంప్యూటర్స్ సైన్స్ 40, బీఎస్సీ మేథ్స్ 40, బీఎస్సీ ఫిజిక్స్ 40, బీఎస్సీ మైక్రోబయాలజీ 40, బీఎస్సీ జూవాలజీ 40, బీబీఏ డిజిటల్ మార్కెటింగ్ 40, బీబీఏ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ 40, బీబీఏ రిటైల్ ఆపరేషన్స్ 40 కలుపుకుని మొత్తం 800 సీట్లు ఖాళీగా ఉన్నాయి.

నాణ్యమైన విద్యే లక్ష్యం



నాణ్యమైన విద్య తమ కళాశాలలో అందుబాటులోకి తెచ్చాం. మౌలిక వసతుల కల్పనపై శ్రద్ధ వహిస్తున్నాం. ఇటీవల కళాశాలలో నూతనంగా రికార్డింగ్ రూమ్ సిస్టమ్ తీసుకు వచ్చాం. కళాశాల వెబ్‌సైట్‌లోని ఆన్‌లైన్ ద్వారా ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకున్న అనంతరం కళాశాలలోని వెబ్‌ఆప్షన్ అవకాశాన్నివిద్యార్థినుల ప్రవేశాలకు అవకాశం కల్పిస్తున్నాం. విద్యార్థినులు కళాశాలలో నేరుగా హెల్ప్ డెస్క్‌లో సంప్రదించవచ్చు. లేదా కళాశాల ఫోన్లు: 0891-2541156, 70322 70810ను సంప్రదించవచ్చు.

- విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ , పీజీ కళాశాల ప్రిన్సిపాల్ రోణంకి మంజుల

అనాథ పిల్లలకు కల్కి సినిమా ఉచిత ప్రదర్శన..



పిల్లలకు ఉచిత ప్రదర్శనలో సీపీ శంఖబ్రత బాగ్చి

డాబాగార్డెన్, జూలై 14: అనాథ పిల్లలను ఆదివారం కల్కి 2898 ఏడీ చిత్రాన్ని జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ జేసీఐ ఆధ్వర్యంలో ఉచిత ప్రదర్శనకు తీసుకెళ్లారు. నగరంలోని పలు థియేటర్లలో వీరికి చిత్రాన్ని చూపించారు. ఈ కార్యక్రమానికి నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి హాజరై పిల్లలతో ముచ్చటించారు. అనంతరం కొంతసేపు పిల్లలతో చిత్రాన్ని వీక్షించారు. అనాథలకు ఆహ్లాదకరమైన విద్య, వినోద అనుభవాన్ని అందించడానికి జేసీఐ వైజాగ్ పోర్ట్ అమిగోస్ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషకరమన్నారు. జేసీఐ ప్రెసిడెంట్ భార్గవ్‌మహర్షి మాట్లాడుతూ గత నాలుగేళ్లగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సంతోష్‌కుమార్, పూర్వ అధ్యక్షులు మాధురి , చంద్రమౌళి, సాయివర్మ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

అక్కయ్యపాలెం, జూలై 14 : శ్రీ నందగిరినగర్ సేవా సంఘం, లక్ష్మీ గాయత్రి హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో 44వ వార్డు నందగిరినగర్‌లో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ అధినేత డాక్టర్ కేవీ రామ్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానికులకు బీపీ, షుగర్‌తో పాటు వివిధ రకాల పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం రామ్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు జయకుమార్, అధ్యక్షుడు బొడ్డేటి ప్రకాష్, ఉపాధ్యక్షుడు గేదెల వెంకన్న, సెక్రటరీ బసవ గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్మాతిక చింతనతోనే జీవితానికి సార్థకత



మాట్లాడుతున్న మాతాజీ మోహిని ఆహుజా

పూర్ణామార్కెట్, జూలై 14: ఆధ్మాత్మ చింతనతోనే మానవ జీవితం సార్థకమవుతుందని సంత్ నిరంకారీమాతాజీ మోహిని ఆహుజా హితవు పలికారు. ఆదివారం వన్‌టౌన్ వాసవీ కల్యాణ మండపంలో సంత్ నిరంకారీ మిషన్ విశాఖ ఆధ్వర్యంలో ఆధ్మాత్మిక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మాతాజీ సంత్ నిరంకారీమిషన్ సభ్యులు బ్రహ్మజ్ఞానం, ఉపదేశాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. సత్‌పురుషుల సాంగత్యం విశిష్టత, సద్గురువుద్వారా పరమాత్మ అనుభూతి పొందవచ్చని తదితర అంశాలపై ఉపదేశం చేశారు. ఈ కార్యక్రమాన్ని విశాఖ శాఖ సంయోజకులు ప్రేమ్ రామ్ చంద్, జ్ఞాన ప్రచారకులు పి.వి.రావు, పిఎస్‌రాజు, క్షేత్రీయ సంచాలకులు రవి పాల్గొన్నారు. రాజ్ వీర్ సింగ్ పర్యవేక్షించారు. మహిళా సభ్యులు పాల్గొన్నారు.

చెస్ టోర్నీలో ప్రతిభ చూపిన చిన్నారులు



విజేతలుగా నిలిచిన చిన్నారులు

విశాఖపట్నం (స్పోర్ట్స్): ఆల్ వైజాగ్ చెస్ సంఘం నిర్వహించిన అండర్-7 ఓపెన్, బాలికల చదరంగం పోటీల్లో సుమారు 50 మంది చిన్నారులు అద్భుత ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు. నగరంలో ఆదివారం జరిగిన టోర్నీ ఓపెన్ కేటగిరిలో అల్లు స్మరణ్, జి.లక్షిత్, బాలికల విభాగంలో మనస్వి నక్కల, ఎన్.లాలిత్య విజేతలుగా నిలిచారు. వీరికి ఆల్ వైజాగ్ చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ బాబూరావు ముఖ్య అతిథిగా పాల్గొని ధ్రువపత్రాలు అందజేసి అభినందించారు. ఈ విజేతలు విజయనగరంలో జరిగే రాష్ట్ర స్థాయి టోర్నీలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని కార్యదర్శి ఎస్.మణికంఠరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్బిటర్ రవిజేత పాల్గొన్నారు.

విశాఖ భూ దందాపై ప్రభుత్వం ఫోకస్!

... 5వ పేజీ తరువాయి

ఒప్పందాలు చేసుకుని, అడ్వాన్స్‌లు ఇచ్చి 500 నుంచి 600 ఎకరాలను రిజిస్టర్ చేసుకున్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు పరిసరాల్లోని భీమిలి మండలంలో పలువురు రైతులను బెదిరించి భూములు కొట్టేశారు. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి దృష్టి సారించడంతో విశాఖలో భూదందాలపై విశాఖ ఫైల్స్ పేరిట నివేదిక విడుదల చేస్తామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదివారం ప్రకటించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇప్పటికే భీమిలి నియోజకవర్గంలో పలు ఆక్రమణలు, కబ్జాలపై ఆయన కొంత సమాచారం సేకరించారు.

అనకాపల్లి జిల్లా కశింకోట మండలం విస్సన్నపేటలో సుమారు 600 ఎకరాల భూ దందాపై ఇప్పటికే జిల్లా టీడీపీ నేతలు ముఖ్యమంత్రికి నివేదించారు. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో కొందరు అనుచరులు విస్సన్నపేట భూములు చేజిక్కించుకున్నారన్నది ప్రధాన అభియోగం. ఈ భూముల్లో కొంతవరకు ప్రభుత్వ, అసైన్డ్, మిగులు భూములతోపాటు గెడ్డలు, వాగులు, రహదారులు ఉన్నాయి. దీనికితోడు విస్సన్నపేటలో భారీగా వనరుల విధ్వంసం జరిగింది. కాగా అనకాపల్లిలోని నాతవరం మండలం భమిడికలొద్దిలో లక్షల క్యూబిక్ మీటర్ల లేటరైట్ తవ్వేశారు. అటవీ భూములు స్వాధీనం చేసుకుని చెట్లు కొట్టేసి, రోడ్లు వేసి లోపలకు ఎవరినీ అనుమతించకుండా ఒక మాఫియాను నడిపించారు. భమిడికలొద్దిలో తవ్వింది బాక్సైట్ గనులే అయినా లేటరైట్ పేరుతో తవ్వుకుని సొమ్ము చేసుకున్నారు. ఇక అనకాపల్లి మండలంలో మెటల్ క్వారీలను లీజుదారుల నుంచి బలవంతంగా స్వాధీనం చేసుకుని వేల క్యూబిక్ మీటర్లు తవ్వేశారు. ఈ భూ దందాలు, గనుల దోపిడీకి సంబంధించి వివరాలను అనకాపల్లి జిల్లా పార్టీ నాయకులు ముఖ్యమంత్రికి నివేదించారు.

ముడసర్లోవ పార్కులో హార్స్ రైడింగ్ ప్రాజెక్టు

... 5వ పేజీ తరువాయి

పార్కులో పక్షులఆవాసానికి ఇబ్బందులు తలెత్తడంతోపాటు, వాటి జీవనం కూడాప్రశ్నార్థకంగా మారుతోందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

స్పందించిన డిప్యూటీ సీఎం

ఈ మేరకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, పర్యావరణవేత్త ఈఏఎస్ శర్మ రాష్ట్ర ప్రభుత్వానికి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు లేఖ కూడా రాశారు. ముడసర్లోవపార్కులో జరుగుతున్న పనులను తక్షణం నిలిపివేయాలని, 105 రకాల జీవజాతుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని అందులో కోరారు. ఈ లేఖపై డిప్యూటీ సీఎం కార్యాలయ అధికారులు స్పందించి జీవీఎంసీ అధికారులను వివరణ కోరినట్టు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికైనా అధికారులు పనులు నిలిపివేసి, హార్స్‌రైడింగ్ ప్రాజెక్టును మరో ప్రాంతానికి తరలించాలని పర్యావరణ వేత్తలతో పాటు, నగర వాసులు కోరుతున్నారు.

క్రీడల్లో ప్రతిభ చూపితే గుర్తింపు



ఎంపిక కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఈడీ రవికుమార్

ద్వారకాకాంప్లెక్సు, జూలై 14: క్రీడల్లో ప్రతిభ చూపితే మంచి గుర్తింపు ఉంటుందని ఆర్టీసీ విజయనగరం జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.రవికుమార్ అన్నారు. ఆర్టీసీ అథ్లెటిక్స్ మీట్-24కు సంబంధించి విజయనగరం జోన్ అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక కార్యక్రమాన్ని కైలాసగిరి పోలీస్ గ్రౌండ్‌లో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అథ్లెటిక్స్ మీట్ -24లో షాట్‌పుట్, జావిలిన్ త్రో, డిస్కస్ త్రో, రన్నింగ్, లాంగ్ జంప్, వంటి ఈవెంట్స్ ఉంటాయన్నారు. విజయనగరం జోన్ నుంచి ఒక్కో ఈవెంట్‌కు ఇద్దరేసి క్రీడాకారుల చొప్పున ఎంపిక చేసి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు పంపుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ అంధవరపు అప్పలరాజు, విజయనగరం జోన్ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ (కమర్షియల్ అండ్ ఆపరేషన్స్) బి. అప్పలనాయుడు, జోన్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ సుధాబిందు, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ కణితి వెంకటరావు పాల్గొన్నారు.



బాలలతో కోచ్ సంతోష్, పార్కు ప్రతినిధులు

రోల్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు

మురళీనగర్; మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్సు పార్కులో ఆదివారం 4వ జిల్లా స్థాయి రోల్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఘనంగా నిర్వహించారు. 11,14, 17 ఏళ్ల లోపు ఆపై దాటినవారికి వేర్వేరుగా పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర పోలీసు కమిషనరు శంఖబ్రత బాగ్చీ హాజరయ్యారు. విజేతలకు బహుమతులందించారు. వైశాఖీ పార్కులో అమర్చిన సీసీ కెమెరాలను ప్రారంభించారు. పార్కు కమిటీ అధ్యక్షులు సనపల.వరప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది పృథ్వీరాజ్, ఉపాధ్యక్షులు పల్లా.చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి పి.వి.సూర్యనారాయణ, రోల్ బాల్ స్కేటింగ్ కోచింగ్ నిర్వాహకులు సంతోష్ తదితరులు ఉన్నారు.

కేజీహెచ్ కథ మారేనా?

... 5వ పేజీ తరువాయి

ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వార్డుబాయ్‌లు సక్రమంగా పనిచేయకపోవడం, డబ్బులు డిమాండ్ చేయడం, లేదంటే రోగిని పట్టించుకోకపోవడం లాంటి సంఘటనలున్నాయి. వార్డుల్లో చేరేందుకు, పరీక్షల నిమిత్తం వార్డుల నుంచి ల్యాబ్‌లు, ఇతర పరీక్ష కేంద్రాలకు వెళ్లేందుకు రోగుల సహాయకులే వీల్‌ఛైర్లు, స్ట్రెచర్లపై తరలించాల్సిన దుస్థితి ఎదురవుతోంది. దీనిపై ఎన్ని ఫిర్యాదులు చేసినా అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని రోగుల బంధువులు విమర్శిస్తున్నారు. అడపాదడపా చర్యలు తీసుకున్నా సిబ్బంది పని తీరులో ఎలాంటి మార్పు కనిపించడం లేదు.

తాగు నీటికీ సమస్య..

కేజీహెచ్‌లోని అనేక విభాగాల్లో తాగునీటి సమస్య వేధిస్తోంది. దాతల సహకారంతో ఏర్పాటు చేసిన కూలర్లు నిర్వహణ లేక పనిచేయడం లేదు. దీంతో రోగుల బంధువులు బయటి నుంచి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోంది. ఆస్పత్రిలోని ఆర్వో ప్లాంటు వద్ద నీటి సరఫరా ఆశించినస్థాయిలో జరగడం లేదు. దీనికితోడు మరుగుదొడ్లు అధ్వానంగా మారడంతో పరిస్థితి అస్తవ్యస్తంగా మారుతోంది. నిర్వహణను సిబ్బంది పట్టించుకోకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో రోగులతో పాటు వారి సహాయకులు అవస్థలు పడుతున్నారు.

మంత్రి పర్యటనపై ఆశలు

ఆరోగ్యశాఖా మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత మొదటి సారిగా సత్యకుమార్ యాదవ్ కేజీహెచ్‌కు రానున్నారు. కేజీహెచ్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించనున్న నేపథ్యంలో ఆస్పత్రి అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలపై చర్చించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఏళ్లుగా పేరుకుపోయిన సమస్యలకు చెక్ పెడతారని, వైద్యులు, సిబ్బంది పనితీరులో మార్పులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనికి తోడు ఆస్పత్రి అభివృద్ధికి సంబంధించి కొన్ని ప్రతిపాదనలను అధికారులు మంత్రికి నివేదించనున్నారని సమాచారం.

పోలియో రహిత సమాజానికి రోటరీ కృషి



రోటరీ సర్టిఫికెట్స్ అందజేస్తున్న డిస్ట్రిక్ గవర్నర్ రవి వడ్లమాని

జగదాంబ కూడలి, జూలై 14: పోలియో రహిత సమాజానికి రోటరీ విశేష కృషి చేస్తున్నట్టు రోటరీ డిస్ట్రిక్ గవర్నర్ వడ్లమాని రవి అన్నారు. నగరంలో ఓ హోటల్ జరిగిననసమావేశంలోఆయన మాట్లాడారు.పలు వైద్య సేవలందజేస్తున్నట్టు చెప్పారు.

రోటరీ డిస్ట్రిక్ట్ నూతన కార్యవర్గం ఎంపిక

ఈ సమావేశంలో రోటరీ డిస్ట్రిక్ట్ 24-25 నూతన కార్యవర్గం ఎంపికైంది. డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ గవర్నర్‌గా ఎ. దర్శసాయి, అధ్యక్షుడిగా కె.వి.రమణ, కార్యదర్శిగా కైలాష్ అగర్వాల్ ప్రమాణ స్వీకారం చేశారు.ఈసందర్భంగా రోటరీ సభ్యులకు సర్టిఫికెట్లందజేశారు.

చీటిల పేరుతో మోసం.. బాధితుల ఆందోళన



బాధితులతో మాట్లాడుతున్న పోలీసులు

ఆరిలోవ, జూలై 14 : ఆరిలోవలోని లక్ష్మీనగర్‌కు చెందిన అయితి లక్ష్మీ చీటి పేరుతో మోసం చేయడంతో బాధితులు ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. ఆమె సుమారు రూ. 5 కోట్ల వరకూ మోసం చేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. లక్ష్మి ఆరేళ్లుగా చీటిల వ్యాపారం చేస్తోంది. మొదట్లో తక్కువ మొత్తంలో చీటిలు వేసి నమ్మకంగా ఉండేది. చీటి డబ్బులను పాటదారులకు సకాలంలో అందజేసేది. దీంతో ఆమెపై నమ్మకం పెరగడంతో చాలామంది చీటిలు వేశారు. దీన్ని ఆసరాగా తీసుకున్న ఆమె పాటదారులకు అధిక వడ్డీ ఆశ చూపించి, పాడిన డబ్బులు ఇవ్వకుండా కాలయాపన చేయడం మొదలుపెట్టింది. అలా చాలా మందికి పాట డబ్బులు ఎగ్గొట్టడంతో అనుమానం వచ్చి పాటదారులంతా ఆమెను నిలదీశారు. దీంతో ఆమె తన దగ్గర ప్రస్తుతం డబ్బులు లేవని, వీలు చూసుకుని ఇస్తానని చెప్పడంతో బాధితులంతా ఆమె ఇంటి వద్ద ఆందోళన చేశారు. ఈమేరకు ఆమె ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు వచ్చి బాధితులను సముదాయించారు. ఆందోళన చేయడం సరి కాదని ఏదైనా ఉంటే స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలనంతో ఆదివారం వారు లక్ష్మిపై ఫిర్యాదు చేశారు. తన వద్దప్రస్తుతండబ్బులులేవని,ఇల్లుఅమ్మి చెల్లిస్తానని లక్ష్మి చెప్పడంతో బాధితులు శాంతించారు.

ముగిసిన వారాహి మహోత్సవాలు



అమ్మవారి పూజల్లో భక్తులు

అల్లిపురం, జూలై 14 : అల్లిపురం ప్రియాంక విద్యోదయ పాఠశాల సమీపాన శ్రీ సాయి శ్రీ మేరు ట్రస్ట్ ఆధ్వర్యంలో లోక కళ్యాణార్థం సాయి దర్బార్ ప్రాంగణంలో కొన్ని రోజులుగా నిర్వహించిన వారాహి నవరాత్రి మహోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. అర్చకులు భక్తుల సమక్షంలో సన్నిధిలోని అనఘాలక్ష్మి వారాహి రాజశ్యామల అమ్మవార్లకు అభిషేకం, ప్రత్యేక పూజలతో ఈ ఉత్సవాలు ఘనంగా ముగిశాయి.

ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ

జ్ఞానాపురం, జూలై 14:గ్రేటర్ 41వ వార్డు పరిధి జ్ఞానాపురంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు ఐతి మధుబాబు ఆధ్వర్యంలో ఆదివారం ఉచితంగా కళ్ల జోళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దక్షిణ నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ పాల్గొని వీటిని అందించారు. రవిబాబు, దుక్కా ప్రసాద్, శ్రీధర్, పి.రాజ్‌కుమార్, జనసేన నాయకులు గవర రమణ, కర్రి బానోజీ పాల్గొన్నారు.

ఎర్నిమాంబకు మొక్కులు తీర్చిన టీడీపీ శ్రేణులు

కంచరపాలెం, జూలై 14 : ఇటీవల జరిగిన ఎన్నికల్లో టీడీపీ గెలుపొంది చంద్రబాబు ముఖ్యమంత్రిగా పదవీ స్వీకారం చేయడంతో జ్ఞానాపురం ఎర్నిమాంబకు 48వ వార్డు ఆపార్టీ కార్యకర్తలు మొక్కులు తీర్చారు. వార్డుకు చెందిన నాళం సర్వేశ్వరరావు దంపతులు, కార్యకర్తలు టీడీపీ అధికారంలోకి రావాలని అనేక పూజలు నిర్వహించారు. అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రిగా అయితే, అమ్మవారి పండగ చేస్తామని మొక్కుకున్నారు. సర్వేశ్వరరావు దంపతులు ఆదివారం మొక్కును చెల్లించుకున్నారు. ఈ పార్టీ విజయానికి కృషిచేసిన వారిని సత్కరించారు. వార్డు సీనియర్ నాయకుడు గొర్లె అప్పారావును ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.



పరశురామావతారంలో జగన్నాథుడు

భీమునిపట్నం, జూలై 14: పట్టణంలోని ఇంద్రజ్యుమ్న మందిరంలో జరుగుతున్న జగన్నాథ రథోత్సవాల్లో భాగంగా స్వామివారు ఆదివారం పరశురామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు రొంపిచర్ల కృష్ణమాచార్యులు తెల్లవారుజామున స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం, భక్తులకు దర్శనాలు కల్పించారు. సాయంత్రం మందిరంలో పరశురామావతారం విశిష్టతను ప్రధానార్చకుడు సింగరాచార్యులు భక్తులకు వివరించారు.

మానవ హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉదయ్ శంకర్

ఆనందపురం, జూలై 14 : మండలంలోని లొడగలవానిపాలెం గ్రామానికి చెందిన మామిడి ఉదయ్ శంకర్ మానవ హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈమేరకు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు షేక్ సిరాజుద్దీన్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

అనాథ పిల్లలకు అన్నదానం

తగరపువలస, జూలై 14 : నాగవంశ సంక్షేమ సేవా సంఘం వ్యవస్థాపకుడు కాళ్ల గురునాయుడు జయంతి పురస్కరించుకుని ఆదివారం స్థానిక లిటిల్ హగ్స్ అనాథ ఆశ్రమంలో కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కాళ్ల శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలరు వెంకటరావు, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



మధురవాడ, జూలై 14 : వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా మధురవాడ శిల్పారామంలో ఆదివారం నగరానికి చెందిన శ్రీనృత్య కళాంజలి డ్యాన్స్ అకాడమీ కళాకారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. ఆనంద నర్తన గణపతి కీర్తనతో ప్రారంభమైన నృత్య ప్రదర్శన బ్రహ్మాంజలి, విష్ణుస్తోత్రం, కస్తూరి తిలకం, లలితా హారతి, సీతా కల్యాణం, వీణా పుస్తకధారణి తదితర కీర్తనలకు రమ్య దర్శకత్వంలో రోషణి, మేఘన, నూతన, సహస్ర నృత్యరీతులు సమకూర్చారు.

శ్రమదానంతో తుప్పల తొలగింపు

భీమునిపట్నం (రూరల్), జూలై 14 : మండలంలోని అమనాం గ్రామానికి వెళ్లే రహదారికి ఇరువైపులా ఉన్న తుప్పలు, డొంకలను స్థానిక టీడీపీ నాయకులు ఆదివారం తొలగించారు. గ్రామ టీడీపీ అధ్యక్షుడు ఆదిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రఘురాంరెడ్డి, శివకుమార్, మంగరాజు, సూరిబాబు, రాంబాబు పాల్గొన్నారు.

పంచాయతీలకు నిధులపై హర్షం

పద్మనాభం (రూరల్), జూలై 14 : రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయడం పట్ల సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గొర్రెపాటి వెంకటలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 250 కోట్లు విడుదల చేశారని చెప్పారు.

సినిమా గైడ్

● **భారతీయుడు-2:** జగదాంబ, శారద, మెలోడీ, రమాదేవి, సంగం, వెంకటేశ్వర-1, కిన్నెర, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక) శ్రీకన్య సినీపోలీస్ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-1 (పెందుర్తి),

● **కల్కి:** శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), శ్రీకన్య, గణేష్, సప్తగిరి (తగరపువలస)

● **సారంగదరియా :** శ్రీవెంకటేశ్వర, శ్రీ నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 37,టమాటా 48, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 26, పచ్చిమిర్చి 70, కాకరకాయలు 40, బీరకాయలు 30, ఆనపకాయలు 14, కాలీఫ్లవర్ 42, క్యాబేజ్ 32, క్యారెట్ 30, దొండకాయలు 30, బంగాళా దుంపలు 32, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 120, అల్లం (పాతది) 140, బరబటి 32, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 50, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 100, పొటల్స్ 40, కీరదోస 32, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 38, చిలగడదుంపలు 36, కంద 60, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	95
ఫారం ధర	--	115
విత్ స్కిన్	--	200
స్కిన్‌లెస్	--	210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 8 లో..



భీమిలి బీచ్‌లో సాగరకన్య విగ్రహం వద్ద పర్యాటకులు



మంగమారిపేట తీరంలో నేచురల్ ఆర్క్ వద్ద సందర్శకుల సందడి

తీరంలో పర్యాటక సందడి

రుషికొండ, భీమిలి బీచ్‌లకు సందర్శకుల తాకిడి

భీమునిపట్నం/సాగర్‌నగర్, జూలై 14 : భీమిలి బీచ్‌రోడ్, కొబ్బరితోట పార్క్, మంగమారిపేట రామాద్రి తీర ప్రాంతాలు సందర్శకులతో ఆదివారం సందడిమారాయి. సాగర కన్య తీరంలో కడలి కెరటాలతో పర్యాటకులు సరదాగా గడిపారు. మంగమారిపేట రామాద్రి బీచ్‌లో శిలా సౌందర్యం వద్ద ఫొటోలు తీసుకుని ఆనందించారు. సందర్శకులు అధికంగా రావడంతో బీచ్ రోడ్డులో వాహనాల రద్దీ నెలకొంది. రుషికొండ తీరం కూడా సందర్శకులతో కిటకిటలాడింది. వాతావరణం కాస్తా చల్లగా ఉండడంతో నగరం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. కొందరు సముద్ర స్నానాలు చేస్తూ అలలతో సయ్యాటలాడగా మరి కొంతమంది బోటు షికారు చేస్తూ ఖుషారుగా గడిపారు. కాగా బీచ్ రోడ్డులో వాహనాల రద్దీ విపరీతంగా పెరిగిపోయింది. రుషికొండ కూడలి వద్ద, టీ పాయింట్ల వద్ద కార్లు, బైక్‌లు పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి.

ఆరిలోవ : నగరంలోని జూపార్కుకు ఆదివారం సందర్శకుల తాకిడి పెరిగింది. సుమారు 4075 పర్యాటకులు జూను సందర్శించగా వారి వద్ద నుంచి రూ. 4 లక్షల మేర ఆదాయం సమకూరినట్టు జూ క్యూరేటర్ మంగమ్మ తెలిపారు.



మాట్లాడుతున్న గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ఎంవీపీ కాలనీ, జూలై 14 : మానసిక, శారీరక ఆరోగ్యానికి యోగా ఎంతో దోహదం చేస్తుందని మిజోరం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు అన్నారు. ఎంవీపీకాలనీలోని గాదిరాజు ఎంపైర్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గాదిరాజు ప్యాలెస్‌లో ఈఏడాది జనవరిలో 270 మందితో 88 నిమిషాల్లో 2,592 ఆసనాలు వేయించి, యోగాసన బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించిన చిలకల రమేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో సెయిల్ డైరెక్టర్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశీవిశ్వనాథరాజు, బీజేపీ విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, ఓం యోగా కేంద్రం అధ్యక్షుడు శాంతారాం, లెండి కళాశాల ఛైర్మన్ మధుసూదన్, గాదిరాజు ప్యాలెస్ ఛైర్మన్ వర్మ, విశ్వ కళాశాల ఛైర్మన్ దర్మరాజు, పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణకు పటిష్ట బందోబస్తు : ఏసీపీ

సింహాచలం, జూలై 14 : సింహగిరి ప్రదక్షిణకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామని ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్ అన్నారు. ఈనెల 20న జరిగే గిరి ప్రదక్షిణ నేపథ్యంలో ఆదివారం ఆయన ఈఓ శ్రీనివాసమూర్తితో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. కొండదిగువ తొలిపావంచా, ఆర్‌టీసీ కాంప్లెక్స్, పాతగోశాల ప్రాంతాల్లో పర్యటించి ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్‌టీఎస్ రోడ్డు పనులు జరిగిన కారణంగా రోడ్డు విస్తీర్ణం పెరిగిందని, ట్రాఫిక్ సమస్య పెద్దగా ఉండకపోవచ్చునని చెప్పారు. ముందస్తు అంచనాలతో భారీగా ట్రాఫిక్ పోలీసులను మూడు షిఫ్ట్‌ల్లో మోహరించి ఉత్సవం విజయవంతం కావటానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వాహక ఇంజినీర్లు శ్రీనివాసరాజు, రాంబాబు, గోపాలపట్నం ట్రాఫిక్ సీఐ, ఎస్ఐ, తదితరులు పాల్గొన్నారు.



క్షేత్రస్థాయి పర్యటనలో ఈఓ శ్రీనివాసమూర్తి, ఏసీపీ రాజీవ్‌కుమార్



హైకోర్టు జడ్జి దుర్గాప్రసాద్‌ను సత్కరిస్తున్న అతిథులు

మహిళలకు హక్కులపై అవగాహన అవసరం : హైకోర్టు జడ్జి

సిరిపురం, జూలై 14 : మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాల నివారణకు మానవ హక్కుల కమిషన్ గ్రామస్థాయి నుంచి ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి దుర్గాప్రసాద్ అన్నారు. ఆదివారం మేఘలయా హోటల్‌లో మానవ హక్కుల కౌన్సిల్ రజతోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలకు వారి హక్కులు గురించి తెలిసే విధంగా మానవ హక్కుల కమిషన్ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు .పోలీస్, రెవెన్యూ, జిల్లా లీగల్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో గ్రామస్థాయి నుంచి ఈ సదస్సులను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ వై. సత్యనారాయణ, మానవ హక్కుల కమిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంత్రి శ్యామ్ ప్రసాద్, రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు, లా కళాశాల ప్రిన్సిపాల్ సీతామహాలక్ష్మీ, బెవరా సత్యనారాయణ పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహచలం, జూలై 14 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా ఆదివారం స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామి, అమ్మవార్లను మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని భూదేవి, నీలాదేవి సమేతంగా స్వర్ణాభరణాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి ఏఈఓ ఆనందకుమార్ పర్యవేక్షణలో స్వర్ణ సంపెంగలు తీసి భక్తులతో స్పృశింపజేసి బేడామండప ప్రదక్షిణ చేశారు. ముఖ్య అర్చకుడు శ్రీకాంతాచార్యులు భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ అష్టోత్తరశత నామావళి పఠిస్తూ అన్ని నామాలకు స్వర్ణ సంపెంగలతో పూజ చేశారు. తరువాత అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం పాంచరాత్రాగమ శాస్త్రవిధానంలో జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

సీఐటీయూ సమన్వయ కమిటీ ఏర్పాటు

తగరపువలస, జూలై 14 : జీవీఎంసీ ఒకటో వార్డులో ఆదివారం సీఐటీయూ సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. జోన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జోన్ కార్యదర్శి మూర్తి అధ్యక్షత వహించారు. కమిటీ సభ్యులుగా టి.ఆదిలక్ష్మి, కె. సుశీల, చిన్ని, విమల, స్వాతి, సూర్యనారాయణ, దామోదర, బాబాజీ, జోగ వెంకటరావు, రాంబాబు ఎన్నికయ్యారు. మీడియా కన్వీనరుగా ఎం. సూర్యకుమారి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జోన్ నాయకులు అప్పలనాయుడు, నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

230 మంది రక్తదానం



శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

సింహచలం, జూలై 14 : యువత రక్తదానానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని 98వ వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం పిలుపునిచ్చారు. స్థానిక ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో వార్డుకు చెందిన నవయువ సేవా సంఘం ఆధ్వర్యంలో వందే భారత్ బ్లడ్ బ్యాంక్, రోటరీ బ్లడ్ బ్యాంక్ సహకారంతో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిబిరంలో 230 మంది దాతల నుంచి 230 యూనిట్ల రక్తాన్ని సేకరించామన్నారు. కార్యక్రమంలో వైద్యులు వినోద్‌కుమార్‌బాలు, అశోక్, భీమిలి నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జి పంచకర్ల సందీప్, అడివివరం సహకార సంఘం అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి సతివాడ శంకరరావు, వార్డు టీడీపీ అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, కొలుసు ఈశ్వరరావు, కర్రి సత్తిబాబు, లంక సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం

ఎంవీపీ కాలనీ, జూలై 14 : స్థానిక ఐఐఏఎం కళాశాలలో ఆదివారం వీఎస్‌సీ వాకర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు ఇప్పటివరకూ నిర్వహించిన, భవిష్యత్‌లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఎస్‌పీ రవీంద్ర, మురళీమోహనరావు, రంగారావు, ద్వారకానాథ్, శుభ, కిషోర్‌కుమార్, ఎన్టీఆర్, ప్రభు, రావు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

పద్మనాభం, జూలై 12 : మండలంలోని గంధవరం, తిమ్మాపురం గ్రామాల్లో ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదక ఆధ్వర్యంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. గురు పౌర్ణమి పురస్కరించుకొని గురువు ప్రాముఖ్యతను, విశిష్టతను తెలియజేస్తూ ప్రచారం జరిపారు. ఈ కార్యక్రమంలో విజయరాంపురం ప్రబోధ సేవాసమితి అధ్యక్షుడు త్రినాథరావు, సభ్యులు సురేష్, శ్రీనివాస్, లక్ష్మి, సంతోష్‌లక్ష్మి, భారతి, తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ పీఎస్‌ను సందర్శించిన సీపీ

ఆరిలోవ, జూలై 14 : నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదివారం ఆరిలోవ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.విమ్స్, తోటగరువు, శ్రీకృష్ణాపురం, ధారపాలెం, డ్రైవర్స్ కాలనీ శ్మశాన వాటిక ప్రాంతాల్లో గంజాయి ఎక్కువగా సేవిస్తున్నారని, ఆయా ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చిన వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని చెప్పారు.

మొక్కలు నాటడం ప్రతిఒక్కరి బాధ్యత

ఆనందపురం, జూలై 14 : మొక్కలు నాటడాన్ని ప్రతిఒక్కరూ బాధ్యతగా స్వీకరించాలని ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం కేవీఆర్ పట్నాయక్ అన్నారు. ఆదివారం ఆ పాఠశాల క్రీడా మైదానంలో దాతల సహాయంతో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు చెట్ల పెంపకం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ప్రతి విద్యార్థి కనీసం రెండు మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రసాద్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



సాగర్‌నగర్, జూలై 14 : నగరంలోని డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాలలో 1986-1991 మధ్య చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఆదివారం సాగర్‌నగర్‌లోని ఓ రెస్టారెంట్‌లో కలిసారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి సమయంలో చేసిన అల్లరి పనులను గుర్తు చేసుకున్నారు. రోజంతా ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. అనంతరం తమకు విద్యా బుద్ధులు నేర్పిన మీగడ రామలింగస్వామి, భగవాన్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బైరెడ్డి పోతనరెడ్డి, జీఎస్ఆర్ శ్రీనివాస్, గిరి, నాగమణి, మాధవి పాల్గొన్నారు.

ఆర్‌కే బీచ్‌లో ఈమా వాక్‌థాన్



జుంబా డ్యాన్స్ చేస్తున్న ఈవెంట్ మేనేజర్లు, యాంకర్లు

రామ్‌నగర్, జూలై 14 : ఆర్కేబీచ్ నుంచి విశ్వప్రియ ఫంక్షన్ హాల్ ఎదురుగా ఉన్న బీచ్ వరకు ఈవెంట్ మేనేజర్ల అసోసియేషన్ (ఈమా) విశాఖ చాప్టర్ ఆధ్వర్యంలో ఆదివారం బీచ్ క్లీన్ నిర్వహించారు. ఈవెంట్ మేనేజర్లు, యాంకర్లు, సింగర్లు, డ్యాన్సర్లు, రోటరీ క్లబ్ ప్రతినిధులు, బీఎస్ఐ సభ్యులు, తమైరా స్కిన్ క్లినిక్ డాక్టర్, వైజాగ్ వాలంటీర్స్, గీతం స్కూల్ విద్యార్థులు హాజరై బీచ్‌లో పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం జుంబా నృత్యాలు చేశారు. జీవీఎంసీ సహకారంతో ఈమా అధ్యక్ష, కార్యదర్శులు సందీప్‌కుమార్, షరీఫ్ ఖాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఈవెంట్ మేనేజర్ల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి దాడి రవికుమార్, వర్మ, ఈమా కార్యవర్గ సభ్యులు సురేష్‌బాబు, జీఎన్ రాజు, సంతోష్‌కుమార్, కామేష్ పాలూరి, ఆశా పట్నాయక్, జగదీష్, జ్యోతి స్వరూప్, ఉమేష్ పాల్గొన్నారు.

పాఠశాల జూబ్లీ ఉత్సవాలకు కమిటీ ఏర్పాటు

భీమునిపట్నం, జూలై 14 : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వందేళ్ల ఉత్సవాల నిర్వహణకు కమిటీని ఏర్పాటు చేశారు. ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థులు సమావేశమై కమిటీని ఎన్నుకున్నారు. స్టీరింగ్ కమిటీ కన్వీనరుగా పాఠశాల ప్రస్తుత హెచ్‌ఎం పొన్నగంటి రమణ, అధ్యక్షుడిగా గాడు అప్పలనాయుడు, ప్రధాన కార్యదర్శిగా మైలపల్లి లక్ష్మణరావు, కోశాధికారిగా పూసర్ల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా కోట మల్లికార్జునరావు, ఎంవీ పార్వతీశం, కె. ముత్యాలరావు, జాయింట్ సెక్రటరీలుగా తట్టికోట భీమారావు, సత్యరాజు ఎన్నికయ్యారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా ఎ.సత్యనారాయణ, ఎల్.ఆదినారాయణ, కె. సన్యాసినాయుడు, రమణ, నరసింగరావు, జోగారావు, వై. హరి, డి. అప్పారావు, ఆనందరావు, వి. నరసింగరావు, జి. రాము, రంగదామారావును ఎన్నుకున్నారు.

అప్పన్నను దర్శించుకున్న బెంగాల్ సీఎస్



సింహచలం, జూలై 14 : వరాహలక్ష్మీనృసింహ స్వామిని ఆదివారం రాత్రి పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి నారాయణ్ స్వరూప్ నిగమ్ దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తి అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న అధికారి గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేసి శేష వస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలు ఇవ్వగా ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

హిందీ విద్యార్థులకు మార్కుల జాబితా అందజేత

భీమునిపట్నం, జూలై 14 : చెన్నైకు చెందిన దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఫిబ్రవరిలో నిర్వహించిన హిందీ పరీక్షలకు సంబంధించిన మార్కుల జాబితాను భీమిలి ఆదర్శ హిందీ ప్రేమి మండలి సంస్థ గౌరవాధ్యక్షుడు గంటా నూకరాజు ఆదివారం విద్యార్థులకు అందజేశారు. బీచ్‌రోడ్‌లోని జీఎస్ఆర్ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో నూకరాజు మాట్లాడుతూ వయస్సులతో సంబంధం లేకుండా హిందీ అవసరమైన వారంతా ఆదర్శ హిందీ ప్రేమి మండలి అందిస్తున్న ఉచిత తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ అధ్యక్షుడు కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.



మార్కుల జాబితాతో ఉత్తీర్ణులైన విద్యార్థులు